
రామాయణం

# ఉత్తర రామాయణము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్ధులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org   Mobile App: Free Gurukul   email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul   Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# విషయసూచిక


1 రామరాజ్యము
2 సీతారాముల ఉద్యానవనవిహారము
3 రాముడపవాదు వినుట
4 సీతాపరిత్యాగము
5 నృగమహారాజు కథ
6 నిమి కథ
7 యయాతి కథ
8 శ్రీరాముడు కుక్కకు న్యాయము చేయుట
9 లవణాసురుని కథ
10 శంబూకుని కథ
11 బ్రహ్మదత్తుని కథ
12 శ్వేతుని కథ
13 దండకారణ్య వృత్తాంతము
14 అశ్వమేధము : సంకల్పము
15 ఇలుని కథ
16 కుశలవుల రామాయణగానము
17 భూదేవి సీతను తీసికొనిపోవుట
18 తక్షశిలా నిర్మాణము
19 లక్ష్మణ పరిత్యాగము
20 శ్రీరాముని వైకుంఠయాత్ర

# ఉత్తర రామాయణము

(రెండవభాగము)

## రామరాజ్యము

శ్రీరామచంద్రమూర్తి అగస్త్యాదిమహాత్ములను వీడ్కొలిపి, సాయంతన విధులను నెరవేర్చుకొనెను. అంత రాజోపచారములతో సరసాన్నములు సిద్ధమైనవి. బంధుమిత్రాదులతో భుజించి, హంసతూలికాతల్పముపై నిదురించెను.

తెల్లవారినది. వందిమాగధులు వచ్చి మేల్కొలుపులు పాడిరి. 'దేవా! నీకై మునులు, దేవతలు వచ్చుచుందురు. కమలబాంధవు డుదయించబోవుచున్నాడు. లోకరక్షణ సేయు నీవు పరుండిన లోకవ్యవహారము లే మందగించును నీ మహిమలు కొనియాడ మా తరము కాదు. నిద్దుర మేల్కొని జగములను మేలు సేయుము' అని ప్రభువును మేల్కొల్పిరి. అంతట నతడు మేల్కాంచి, స్నానాదులు నిర్వర్తించి, తొడవులుధరించి గృహమున కేగుసరికి, సీతాదేవి తనకంటె మున్నుగా లేచి, స్నానాదుల పూర్తిచేసికొని సింగారించుకొనుచున్నది. ఆమె అద్దము చూచుకొనుచున్నది. వెనుకనే శ్రీరాముడు వెళ్లెను. అతనిని చూచి ఆమె సిగ్గిలినది. అతడు నవ్వెను. ఎన్నాళ్లు కాపురము చేసినను సరసులకు పరిహాసములతోనే ప్రొద్దుపోవును. అంత నతడు నవకాంత భూషణములు ధరించెను. కులదేవతలకు ప్రణామములు కావించెను నవరత్నములు పొదిగిన కోటిసూర్య ప్రభా

వంతమైన కిరీటమును ధరించెను. కర్పూరతిలకము పెట్టుకొనెను. వజ్రాల కంకణములు కేల దాల్చెను. రత్నహారములు మెడలో వేసికొనెను. ముత్యాల అంగీ తొడిగికొని, పెద్ద పీతాంబరము ధరించి కొలువుకూటమునకు వేంచేసెను.

అతడు వచ్చుటతోడనే అంగన యొకతె కర్పూరపు టారతిచ్చినది. పాదుకల నొకతె విప్పినది. అంతకుముందే వచ్చియున్న వసిష్ఠాది మహర్షులకు వందనము చేసెను. వా రాశీర్వదించిరి. అప్పు డతడు బంగారుసింహాసనము నధిష్ఠించెను. చామరములు వీచుచుండిరి కొందరు వట్టివేళ్ల తాళవృంతములతో వీచుచుండిరి. కొందరు శ్రోత్రపేయముగా వీణలు, పిల్లనగ్రోవులు మొదలైన వాయిద్యముల వాయించిరి. కొందరు నాట్యము చేసిరి. సామంతులు చేతులు కట్టుకొని నిలువబడి తదనుజ్ఞాతులై ఆసీనులైరి. వందిమాగధులు కైవారములు చేసిరి. తమ్ములు వచ్చి నమస్కరించిరి. వారిని కూర్చుండ నియమించెను. విభీషణాంగద ప్రముఖులు వచ్చి నమస్కరించి కూర్చుండిరి. హనుమానుడు వచ్చి పాదము లొత్తుచుండెను. దీనానాథజనులు రాగా వారికి సువర్ణాది దానములిచ్చెను. అభియోగములు చెప్పిన విని తీర్పులిచ్చెను ప్రజ లట్టిసమయమున శ్రీరామచంద్రమూర్తిని కన్నులారచూచి యానందింపగోరి దర్శనమునకై వచ్చి చూచి తనివిచెందక ఆనందము ననుభవించుచుండిరి.

ఇట్లు రామరాజ్యము సకలజనానందకరమై జరుగుచుండెను అంత నొకనాడు జనకుడు మూర్తీభవించిన వేదాం

తముపోలె వచ్చెను. అతని కెన్నో మర్యాదలు చేసి 'మామగారు మిమ్ము జూడవచ్చి చిరకాలమైనది. దయయున్న దే? మిమ్ము జూచిన మా తండ్రిని జూచినట్లే యున్నది. మీరిక్కడ నెన్నాళ్లున్నను మాకు తనివితీరదు. కాని మీ ప్రజలు మీ విరహమును సహింపలేక బాధపడుదురు. అందుచే మీ దేశమునకు పోయిరండు. కటాక్షముంచుడు! అనెను. అతడు 'రామభద్రా! నీవేనో మామవని నన్ను మన్నించితివి కాని నిన్ను కొనియాడతరం చే? నా అదృష్టముకొలది నీవు నా కల్లుడవైనావు. నీ మహిమ తలచుకొనుచు నూరికి పోయివచ్చెదను' అని రాముడు వీడ్కొల్పగా మిథిల కేగెను.

అంత యుధాజిత్తు, భరతుని మేనమామ, ప్రవర్ధనుడు, కాశీరాజు, రాముని స్నేహితుడు రాగా వారిని గౌరవించి పంపెను. సామంతులను వారిచ్చు కానుకల తీసికొని వారిని మన్నించి 'రాజవరేణ్యులారా! మీరు వెళ్లి మీ ప్రజలను జాగ్రత్తగా పాలింపుడు' అని తమ్మునిచే వారి కందరికి వస్త్రమాల్యాదు లొసగి సాగనంపెను. వారలిచ్చిన కానుకలను భరతాదులు తేగా వాటినందుకొని విభీషణాదుల కొసగెను. అందొక ముత్యాలహారమును 'తాతా! ఇది నీవు తగుదువని' జాంబవంతున కిచ్చెను. అతడు 'ముసలివానికి నాకిదెందులకు?' అనుచు 'మహాప్రసాద'మని స్వీకరించెను. ఆ వరుసలో సుగ్రీవాది వానరోత్తముల నెల్ల మణిహారాదులచే బహూకరించెను. విభీషణున కెన్నో కానుకల నిచ్చి 'రాక్షసోత్తమా! నీవు లంక కేగి గుణవంతుడవై పాలింపుము. ప్రజలా రాక్షసులు,

వారి మనస్సు స్వతఃక్రూరమైనది. కాల మొక్కరీతిగా పోదు. నీవు మాత్రము ధర్మము తప్పక రాజ్యమేలుము. నీకు వినయాది సద్గుణములు వెన్నతో పెట్టినవే. నే నిక చెప్పనక్కరలేదు. పోయిరమ్ము.' అని చెప్పగా వారనేకవిధముల శ్రీరామచంద్రుని స్తుతించిరి. అంత హనుమంతుడు 'రామభద్రా! నాకు మీ పాదసేవ చేసికొను భాగ్యము ప్రసాదింపుము. నీ కథలున్నన్నినాళ్ళు నాకు మృతిలేకుండునట్లు వరము ప్రసాదింపుము' అని కోరెను. అంత శ్రీరాముడు సింహాసనము దిగి ఆంజనేయుని కౌగలించుకొని 'మారుతీ! నీవు కోరిన కోరికలిచ్చితిని. నే నెల్లపుడు నీ మనఃపీఠము నధివసించియుందును. నీవు ప్రత్యుపకార తత్పరుడవై శాశ్వతకీర్తి నందుము.' అని వారి నెల్ల వెళ్ళుట కాజ్ఞ యిచ్చెను అంత వారు కన్నుల నీరు గ్రుక్కుకొనుచు 'రామచంద్రా! పంపుచున్నావా?' అనుచు తిరిగి తిరిగి చూచుచు వెళ్ళిరి. దయగల్గి రక్షించురాజు నెవరు వదలగలరు?

వారి నట్లు పంపగా నొక్క దివ్యపురుషుడు పుష్పక విమానమును చేకొనివచ్చి 'శ్రీరామచంద్రా! కుబేరుడు నిన్ను సేవింపుమని యీ విమానమునంపినాడు. చేకొనుము' అనెను. రాముడు 'ఓ దివ్యవిమానమా! నా కవసరము వచ్చినపుడు వత్తువుగాని వెడలిరమ్ము' అని నమస్కరించి సాగనంపెను.

శ్రీరామచంద్రుడు రాజ్యముచేయు కాలమున నెలకు మూడు వానలు కురియుచుండెను. ఈతిబాధలు లేవు. భూమి సుభిక్షమై సమృద్ధిగా పండుచుండెను. పెనుగాలు లెప్పుడు వీచుట

లేదు. దేవమాతృకలైనను నదీమాతృకలువలె చక్కగా పండు చుండెను. ఆధి వ్యాధి బాధలేనియూ ప్రజలెరుంగక సుఖజీవ నము గడపుచుండిరి. అదే రామరాజ్యము. సకలకులముల వారును స్వ స్వధర్మముల నిడనాడక న్యాయప్రవర్తనులై అన్యోన్యసహకారములతో సుఖించుచుండిరి. కాగ కొలది గుర్రముగా; రాజు కొలది రాజ్యము.

అంత వసంతకాలము వచ్చినది. వనలక్ష్మి ప్రాతదళము లను విడనాడి క్రొంజిగురు తొడిగినది. మొగ్గలు కైసేసి కొన్నది. పూలు తరుముకొన్నది. ప్రోడులుకూడ చిగిర్చినవి. మామిడిచిగుళ్ళు, పూతలువేసి, బలిసి, వీనులవిందుగా కోయి లలు కూయుచున్నవి. చిలుకలు, గోరువంకలును, ఉల్లాస ముగా తిరుగుచున్నవి. మల్లెతీగెలు పూలతో తమదేహముల కప్పివేసినవి. తుమ్మెదలు ఝంకారముచేయుచు మన్మథునికీర్తి నాలాపించుచున్నవి. జోడు లెడబాయని యదృష్టవంతులందరూ నా కాలమున మలయమారుతమును సేవించుచు ఆనందరస ప్రవాహముల దేలియాడుచుండిరి. వసంత నవరాత్రములు పూజలు మహోత్సాహముతో ఉత్సవములు చేయుచు ప్రజలు ప్రియకామినుల గూడి రతీమన్మథుల పూజించుచుండిరి.

## సీతారాముల ఉద్యానవన విహారము

అట్టి సమయమున శ్రీరామచంద్రుడు సీతాసమేతుడై పుష్పరథమెక్కి సముచిత పరివారముతో ఉద్యానవనమున కేగెను. అచ్చట కొంతసేపు కోకిలపాటలు వినుచు, మరికొంత సేపు నెమళ్ళ నృత్యములుచూచుచు వినోదించెను. సీతతో

గూడి క్రీడాపర్వతముమీదికి వెళ్ళెను. పూలగుత్తులుకోసి ఆమెకొప్పున తురిమెను. ఆమెను తీగెవంచుమని తాను దిగుళ్ళను త్రుంచుమండెను. మెట్టతామరపూవు తీసి 'ఇదిగో, ఈ పూవు నందుకొమ్మ'నెను. ఆమె అందుకొనుటకై చేయిచాచిన కొలది పైకెత్తుచు కొంతసేపామె నలయించెను. అక్కడనున్న వనవీథుల తిరుగుచు, సరసోక్తులాడుచు, వక్రోక్తులతో కోపమునర్పించుచు, చిలిపిచేష్టలతో నవ్వించుచు, విలాసముగా కొంతసేపు విహరించెను.

అంత వారిద్దరు దగ్గరగానున్న కొలనుచేరిరి. అందు తామరపూవులు చక్కగా వికసించియున్నవి. హంసలు మొదలైన నీటిపక్షులు వారికి తోడైనవి నీటిలో విహరింపదలచి సీతను 'సిద్ధముకమ్మ'నెను. ఆమె పట్టుచీరలువిప్పుకొని, తెల్లని సన్నమడుపులు కట్టుకున్నది. అర్ధోరుగము బిగించుకొన్నది. రాముడును తగినబట్టలు కట్టుకొని జలక్రీడకు దిగెను. ఒకరిమీదవొకరు నీరు చిమ్ముకొనుచు, అందకుండునట్లు ఈదులాడుచు అమృతరసముల తేలియాడిరి. అంత వారిరువురును ఒడలొత్తుకొని, కౌశేయములు కట్టుకొని ఆ యుద్యానవనములోనున్న మేడలోనికివెళ్ళిరి. దానిచుట్టును రకరకపు పూలతీగలుపూచియున్నవి. అచ్చట చెలికత్తెలందరును వారిని కలిసికొనిరి. వారు సీతకు రత్నాలకమ్మలు, శాలీలు, ముత్యాలసరాలు అలంకరించి, కస్తూరిబొట్టు పెట్టిరి. అంతలో కొందరు పరిచారికలు కౌసల్యపంపినదని పంచభక్ష్య పరమాన్నములు, రకరకపు పిండివంటలు తెచ్చి వారిముందట పెట్టిరి. అంత సీతా

రాములు సరసల్లాపములాడుకొనుచు, కావలసిన పదార్థముల నారగించిరి. వారిద్దరును ద్రాక్షాసవమును గ్రోలిరి. భోజనములు పూర్తియైనవి. ఒక పరిచారికవచ్చి తాంబూలము లిచ్చినది. అంతలో కొందరాటకత్తెలు ఆడిరి; పాటకులు పాడిరి. ఆ వినోదములతో వారు కొంతసేపు కాలక్షేపము చేసిరి. అప్పటికి ప్రొద్దుగ్రుంకవచ్చినది. శ్రీరాముడు భటులు తీసికొనివచ్చిన భద్రగజము నెక్కెను. సీతాదేవి పచ్చలపల్లకీ నెక్కినది. వారు చెలికత్తెలు వెంట సేవించుచురాగా పట్టణములో ప్రవేశించిరి.

ఆ దంపతులను చూచుటకు ఆ పురవనితలు తమతమ పనులుమాని వీధిలోనికి వచ్చిరి. రోజురోజు చూచుచున్నవారైనను, వారు తనివి చెందలేదు. పెద్ద ముత్తైదువలు లాజలు చల్లిరి. కొందరు నివాళులిచ్చిరి. వారినందరిని చూచుచు శ్రీరాముడు మొగసాలచేరెను. భరతుడు కైదండ నీయగా రాముడు భద్రగజమునుండి దిగెను. లక్ష్మణుడు పాదుకలు తొడిగెను. శత్రుఘ్నుడు కాళ్లు కడిగెను. శ్రీరాముడు తనతో వచ్చిన ఆ వత్తసర్గమును ఇళ్లకుపంపి, తాను చంద్రకాంత గృహమున కేగెను. అది వారికి విలాసభవనము. అక్కడ సోదరులతో కలిసి కొంతసేపు ముచ్చటలాడికొనెను. తర్వాత భోజనముచేసి, సీతయున్న రాణివాసమున కేగెను.

అక్కడ వారి పడకటింటిలో రతీమన్మథుల బొమ్మలు, రోహిణీచంద్రుల చిత్రపటములు, శచీదేవేంద్రుల చిత్రములు నున్నవి. ముత్యాలతోరణాలు, పచ్చలజాలరులతో అగరు ధూపములతో ఉత్సాహమును రేకెత్తించుచున్నదాగది అందు

పచ్చలు తాపిన బంగరు పట్టెమంచముపై రామభద్రుడు శయనించినాడు. అంత లక్ష్మీదేవివలె తిలకముదిద్దుకొని, నవరత్నాలసొమ్ములు సవరించుకొని మదగజయానయై అందెలు మ్రోయునట్లు మెల్లగా సీతాదేవివచ్చి నాథునిచేరినది అంత యాక్కుంటతడవు కపటనిద్ర నటించినాడు. ఆమె మనస్సు రంజించు గీతముల పాడినది. అతడుద్రిక్తుడై ఆమె చెక్కుల నొటినాడు. అందులకేకదా పాటలు! తమ్మలములు మడిచియిచ్చినవి. గంధము పూసినది. అతని మనసునకు నచ్చునట్లు ఎన్నో సేవలు సేసినది. అతడానందపరవశుడై భార్యతో నేకమయ్యెను. అన్యోన్యమైనప్పుడే సరసముగా నుండుట!

వారికి సరసశృంగార చేష్టలలో రాత్రిచాలలేదు. ముంగురులు పెరిగదువ్వెను. పువ్వులు ముడుచును. చిరుచెమటలు గోటితో గీయును. తననోటివీడె నామె నోటి కందిచ్చును ఇంకను ఎన్నియోరీతులు. మనమేమి యూహింపగలము? రసోద్రిక్తులైన యాలుమగల శృంగార విలసితములు పలురకములు. అవెట్లుచేయుదురో వారికే యెరుకలేదు. అట్లు కొంతకాలము గడచినది.

సీతాదేవి గర్భవతియైనది. రాకరాక కడుపువచ్చెనేమో శ్రీరాముని కెంతో ముచ్చటగానున్నది. అత డేకపత్నీవ్రతస్థుడు. అట్టివారికి తన కడుపుపంటవలెనని యుండును. కానిచో ధుమధుమలు మటమటలు ఉండవచ్చును. శ్రీరాముడ కావార్త చూచాయగా తెలియగాగానే యామెనద్దకు వచ్చెను. ఆమె వింతగా కన్పడినది. ఆమెను దగ్గరగా తీసికొనినాడు. లేతెక్కులు

గీటుచు 'తరుణీ! నీదేహ మెంతగా నుంటివే? పెదవులు పాలిపోయి నవి. మొగము స్రుక్కినది. నింపుచంపకమువలె వింతకళ కల్గి యున్నది. నోట మట్టివాసన కొట్టుచున్నది. నీకు మట్టిమీద మనసుపోయెనేమో? మంచిదే. గర్భవతులు మట్టినితినిన పుత్త్ర పుత్రుడు భూకాంతుడగునట. కాని నీకే యే పదార్థములు కావలెనో? చెప్పుము.' అని బుజ్జగించెను. ఆమెకు సిగ్గువేసినది. ఎన్నాళ్లు కాపురము చేసినను ఇటువంటివి క్రొత్తగా వచ్చినపుడు సిగ్గే. నుడువుగాను ఉన్నది. కాని కోరికలను మనస్సు కోర నిచ్చుటలేదు. అయినను శ్రీరాముడు మరియుమరియు బ్రతి మాలెను. దానితో ఆమె తనకోరికను మెల్లగా వెల్లడించెను. 'నాథా! మీరు కోరికలు తీర్చువారైయుండ నాకు కోరికలేల కలుగు? అయినను కోరుచున్నందున కోరుచుంటిని. నాడు గంగా నదీతీరమునకున్న మున్యాశ్రమములలో మునిపత్నులతోఁ గూడి యొక్కనాడు మెలగవలెనని యున్నది. అంతకంటె నాకు వేరు కోరిక లేదు.' అన్నది. ఆమాటలకు సంతసించి శ్రీరాముడు 'సతీ! నీవుకోరినట్లే చేయుదును. అదెంతపని? రేపే ఉదయముననే నిన్ను రథముపై పంపుదును.' అనెను.

అంతట రాముడు సీతావహారీదేవిని లాలించి తాను సభాస్థానమునకు వచ్చెను. అచ్చట మంత్రి పురోహితాదు లాతనిరాకకు వేచియుండిరి. వారికి సంతోషము కల్గునట్లు కొంత సేపు సల్లాపములాడెను. పండితులు కొందరు శాస్త్రవాదములు సేయగా నాలకించెను. కథకులు చెప్పు కథలను వినెను. పరి

హాసకులు చెప్ప హాస్యమునకు కొంతసేపా సందించెను. ఇట్లు కొంతసేపు సభనలరింపజేసి వారినెల్ల పంపివేసెను.

## రాముడపవాదు వినుట

అంత గూఢచారుడైన భద్రుడు వచ్చి రామచంద్రునకు నమస్కరించెను. శ్రీరాముడతని భావమెరిగి రహస్యమందిరము నకు తీసికొనివెళ్లెను. అచ్చట రాముడు విశేషములు చెప్పుమని భద్రునడిగెను. అతడు నమస్కారముచేసి 'శ్రీరామచంద్రా! నీవు సకలలోక బాధాకుడైన రావణుని సంహరించి లోకము లను సుఖముగా నేలుచుండగా వార్తలేముండును? అందరును నిన్ను వేనోళ్ళపొగడుచుండిరి' అనెను. అంత రాముడు చిరు నవ్వుచు 'భద్రా! మంచిని కీర్తించుచున్నారని నీవు చెప్ప నక్కరలేదు. నాకు సమ్ముఖముననే కీర్తించుచున్నారు. అప నిందలేమైన అనుకొన్నచో చెప్పుము. చాటున నిజముమాట్లా డుదురు. రాజు చాటున నాపై కొన్ని తప్పులు నాలోకించి దానికి తగినట్లు సవరించుకొనవలెను. అందుచే నీవు నిన్నునేమైన నన్ను చెప్పుమనెను

అంత భద్రుడు 'నీవింత నిర్బంధించిన నేనేమి తెల్పు దును? హీనులు నిజము తెలియనేరక యెన్నో నడరుదురు. వారి నోటికి హద్దులేదు. దయకల్గినరాజును మెత్తనివారందురు. కఠి నముగానున్న యముడందురు. ఇట్లు నిజానిజముల గమనించని మూర్ఖులేమనుకొన్నను సరకుసేయరాదు. అయినను నీవు తెల్పుమన్నందున తెలుపకతప్పదు.' ఇక్ష్వాకువంశమున పుట్టి

కూడ, తొడమీఁద పెట్టుకొని రావణుఁ డెత్తుకొనిపోయి యేఁడాది యుంచుకొన్న భార్యను తగుదునని తెచ్చి యింటిలో పెట్టుకొన్నాఁడు. భార్యమీఁద ప్రేమ అట్లుండును. రాజే ఇట్లైన మన మొదలకు కారాదు. భార్య నెవ్వరైన ఎత్తుకొనిపోయినను తిరిగి తెచ్చుకొనవచ్చును. 'యథా రాజా తథా ప్రజా' కదా! అని వాడ వాడల నాడుకొనుచుండిరి. ఆ దుర్జనులనోళ్ళు మనము మూయలేము. వారి కేమనవచ్చును.' అనుటతో వాఁడి శూలములు చెవులలోనికి చొనిపినట్లు జాలిపడి దగ్గరలోనున్న మంత్రిసఖులను కన్గొని 'ఈ మాటలు నిజమేనా!' అని యడిగెను వారు తలలు వంచుకొని 'ఏమని చెప్పువారము' అని యూరకొనిరి.

అంత శ్రీరాముఁడు ఏమియు మాటాడలేక బాధపడుచు నివ్వెరపోయి, దగ్గరనున్న వారినందరిని పొమ్మని పంపివేసెను. అప్పటికి రాత్రి ప్రొద్దుపోయినది అప్పుడే ఒక కంచుకిని పిలిచి తన తమ్ములఁ బిలుచుకొని రమ్మని పంపెను. వాఁడు త్వరగా వెళ్ళి రాజాజ్ఞను భరతాదులకు తెల్పెను. వారు 'రాముఁ డిప్పుడు పిలుపనంపుట యేలొకో!' అనుకొనుచు తొందరగా వచ్చిరి. వారు వచ్చుసరికి శ్రీరాముఁడు దైన్యమునంది నిట్టూర్పుచు వేఁడిగాలితో పెదవులాడించుచుండెను. కంటివెంట కన్నీరు కాల్వలుగా ప్రవహించుచుండెను. ఒక్కసారి ఆశ్చర్యము, మఱొక్కసారి విచారము కనుపరచుచు పిచ్చివానివలె నుండెను. అట్లు మూర్తీభవించిన దైన్యములాగున నున్న రాముని చూచి వారు నివ్వెరపోయిరి. అట్టి రూపము రామునకుఁ గల్గుట కిదే మొదటిసారి.

అదెందులకు వచ్చినదో వారూహింపలేకపోయిరి. వారు విచారించుచు జన్నకు సాగిలపడి మ్రొక్కిరి.

శ్రీరాముడు కన్నీళ్ళు తుడుచుకొనుచు వారిని లేవనెత్తి 'తమ్ములారా! మీరు నా ప్రాణములు. నాయందెంతో భక్తిశ్రద్ధలు కలవారు. నన్ను సఖులుగా ప్రేమించుచు రాజ్యమునకు చేదోడగుచున్నారు. అట్టి మీకు చెప్పనింత ఉండదలేదు. 'అనుపగ్నికి దేమా? ఇతడెన్నడు నిట్టులనలేదే? అనుకొని చూచుకొండిరి. అంతసతడు 'ప్రజలు రావణుడెత్తుకొనిపోయిన సీతను శంకలేక రాముడేలుచున్నాడు మనకేమి సంశయము మనముకూడ అట్లు ప్రవర్తింపవచ్చును.' అని నన్నుదూరిరి. ఆమాటలు శల్యములై నాహృదయమున నాటుకొని బాధించుచున్నవి. 'అని అంవరితోను చెప్పి, మరల' లక్ష్మణా! నీ వెరుగవా? రుద్రులు, ఆదిత్యులు, గంధర్వులు, దేవతలు చూచుచుండగా సీతను నేనొల్లక అగ్నిప్రవేశము చేయుమంటినికదా! అప్పుడు వహ్ని వచ్చి 'రామా! ఈమె మహాసాధ్వి. నే నెరుగుదును.' అని చెప్పినాడుకదా! అప్పుడు దేవతలందరును ఆమోదించిరి. ఒకవేళ రావణుని చంపితినను మొగమాటమున వారిట్లనిరేమో అని అగ్నిలోనికి దూకమంటినికదా! అదైనను మీరు గమనించిరా? ఒకవేళ 'పామరులనుకొనుమాటను పాటించుట ఏటికి'ని మీరందురేమో? ఎవరైనను అపకీర్తియన్నప్పు మూరకొనిన ఆ నింద మనవంశమునకు చుట్టుముట్టుకొని కళంకము చేయదా? మంచికీర్తికై వివేకులుత్సహింపుదురు. ఎప్పుడైన నొక్క చెడ్డపని చేసిన మాయకీర్తియంతయు గంగపాలుకాదా? అందుచే బ్రతికినిండ

పొందుటకంటె చచ్చుటేమేలు. కాని కీర్తికై ప్రాణములనైనను, ప్రాణతుల్యులనైనను మిమ్ములనైనను విడచుటకు జంకను. అందుచే అగ్నియందర్పింపగా జానకిని విడచుటయే కర్తవ్యము. లేకున్న లోకులనోళ్లు మూయలేను అపకీర్తిపోను. దీనికి మీ రేమైన సద్ధము చెప్పిన నాతో దెల్పు' అనెను. అందులకు వారందరు విన్నపోయి చాల చింతించిరి

అంతట రాముడు లక్ష్మణునితో 'మీ వదినె గంగానదీ తీరవాసులైన మునిపత్నులతో కూడి యుండుటకు కోరినది నేను పంపెదనంటిని. సీత నామిమ్మతో రేపుదయముననే తీసికొనివెళ్ళి వాల్మీకి ఆశ్రమప్రాంతమున విడిచిరమ్ము' ఆమెను నాకును ఇంతటితో ఋణముతీరినది. అని యాజ్ఞాపించెను. అది విని వారందరును కన్నీరుకాల్వలుగ శోకించుచు నిండ్లకేగిరి. ఆరాత్రిరామున కొకయుగమువలె గడచినది.

## సీతాపరిత్యాగము

తెల్లవారినది లక్ష్మణుడు ధైర్యముగా సుమంత్రునితో 'సీతాదేవిని గంగాతీరమునకు పంపుచున్నాడు. రథము సిద్ధము చేయు'మనెను. అట్లే సుమంత్రుడు రథమును తీసికొని వచ్చెను. లక్ష్మణుడు లోనికేగి 'అమ్మా! శ్రీరాముడు నిన్ను గంగాతీరమున నున్న మునిపల్లెకు తీసికొని వెళ్ళుమనినాడు. సారథిరథము సిద్ధముచేసి తెచ్చినాడు. రమ్మ' అని చెప్పగానే 'విభుడు సెలవిచ్చెనా? నా కోరిక తీర్చెనా?' అని సంతోషముతో మునిపత్నుల కిత్తునని చీరలు, ఆభరణములు సిద్ధము

చేసి రథముపై కెక్కినది. లక్ష్మణుడు 'పాపము ! ఈమె యెంత వెర్రిది ? రాబోవు కష్టము నెఱుగక ఉల్లాసముగా ప్రయాణ మగుచున్నది.' అని లోలోన కుంకుచు పైకి దుఃఖరేఖల నగపడనీయక సుమంత్రుని రథము తోలుమనెను.

అంత దారిలో అపశకున పరంపర లైనవి. నక్కలెదురై కూతలు కూసినవి. సుడిగాలి ప్రతికూలముగా వీచినది. జెండాపై గ్రద్దలు వ్రాలినవి. అన్నియు కనుగొని సీత తత్తరపడెను. ఆమెకు దక్షిణ దేహమదరెను. 'లక్ష్మణా ! మనస్సు చేయి పెట్టి కలచినట్లున్నది. మొన్నటిదాక వనవాసము చేసియుండియు మరలనేల కోరితిని. ఆ మువారి కేమియు తెలియదని నివారింపక అతడేల నొప్పుకొన్నాడు? నేను మరొక కోరైన కోరక, అట్లేల కోరితిని ? వినాశకాలమున విపరీతబుద్ధి కల్గును కదా! రాబోవు దుర్దశ నీ దుర్నిమిత్తములు సూచించుచున్నవి. మగని వదలి వచ్చు నాకిక చింతయేల ? శ్రీరామునికి, అతని ప్రజలకును మా యిలువేల్పులు శుభములు చేకూర్తురు గాక !' అని దేవతలకు నమస్కరించెను. అంత లక్ష్మణుడు 'సీత ఎంత చిత్తశుద్ధి కలది ! తనకు వచ్చు దుర్దశను తెలియనేరక భర్తకు శుభము కల్గవలెనని కోరుచున్నది. ఇట్టి మహాపతివ్రతను పతి నెడబాయ జేసినాడా పాడువిధి !' అనుకొని ఉస్సురని నిట్టూర్చెను.

దుశ్శకునములగుచునే యున్నవి. వారు కొన్ని సెలయేరులు, పర్వతములు దాటిరి. చిన్నచిన్న పల్లెలు అతిక్రమించిరి. గోమతీనది ప్రాంతమున కేగుసరికి ప్రొద్దుపోయినది. అట

నానాడుండి మరునాడుదయమున బయల్దేరి మధ్యాహ్నమగు సరికి గంగాతీరము చేరి సీత గంగనుచూచి మ్రొక్కినది. ఆ చల్లనిగాలి కామె మనస్సు కొంత చల్లబడినది. కాని అదెంత సేపు? లక్ష్మణుడు 'ఈమెతో శ్రీరాముని యాజ్ఞ నెట్లు చెప్పగలను?' అని కన్నీరు పెంపుకొని విచారించుచుండెను.

అంతవరకు నామె లక్ష్మణునింక చూచుటలేదు. ఆ విధము చూచుసరి కామె మనసు కలిగినది. 'లక్ష్మణా! నీవెంతటి కష్టములు వచ్చినను కన్నీరు పెట్టుకొని యెరుగవు. ఇంద్రజిత్తుతో యుద్ధము చేయునాడైనను దుఃఖించలేదు. ఈనాడేల విచారించుచున్నావు? మీ అన్నదమ్ములకును, పూతసర్గమునకును శుభమే కదా! మానసిక వ్యథలు బాపెడి గంగామతల్లిని చేరినాము. ఆవలికి దాటి మునిపత్నులగాంచి సేవించి వత్తము. రమ్మ.' అన్నది. కాని అంతలో పొంగిపొరలువచ్చు దుఃఖముతో క్రుంగుచున్న లక్ష్మణునిచూచి 'అన్నా! పోనీ, [illegible]?' అన్నది. అంత లక్ష్మణుడు దుఃఖమును నిగ్రహించుకొని 'అమ్మా! [illegible] తెలిసినది. మరలిపోవుట యేటికి? గంగ దాటుదము.' అని రథము దిగిరి. సారథి నక్కడనే యుంచి సీతను పడవనెక్కించెను. తానును ఎక్కి అవతలయొడ్డునకు దాటెను.

అప్పుడు కన్నులనీరు కాల్వలై ప్రవహించుచుండగా 'అమ్మా! నన్ను నీవు శపించినను సరే. నీకొక కష్టవార్త చెప్పవచ్చితిని. జనులు నిందించు కృత్యము చేయవచ్చితిని.' అని ఆమె పాదములపైబడి విలపించుచుండెను. అంత జానకి 'అన్నా! ఎప్పు

డును నీవింతగా విలపింపలేదే? ఈవేళ వచ్చినకష్టమేమి? ఎవని కెగ్గుదలంచినావు? పరసతులను తల్లులుగా భావించువాడవు, బ్రాహ్మణభక్తి కలవాడవు. శ్రీరామునాజ్ఞపై నన్ను తీసికొని వచ్చితివికదా! ఇచ్చట నిందితకృత్యము లేమియున్నవి? నిన్ను మీయన్న నిరాకరించెనా? గురునింద చేసితివా? శరణన్న వారిని చంపితివా? రామాజ్ఞలేక నన్నుగొనివచ్చితివా? నాపై శ్రీరామునికి దయతప్పినదా? నాకేమియో భయమగుచున్నది. శ్రీరామచంద్రుడు కుశలనేకదా! ఆ మహారాజు నీపైకాని, నాపైకాని దయమాలెనా? అనుమానపడక చెప్పుము?' అని గద్గదకంఠియై అడిగినది.

లక్ష్మణుడు మొదట కొంత జంకినను ఇక చెప్పక తప్పదని నిశ్చయించుకొని 'అమ్మా! ఇంతవరకు వచ్చి చెప్పక తప్పునా? వినుమమ్మా! తల్లీ! దురాత్ములైన ప్రజలు వివేకము లేక 'రావణుడెత్తుకొనిపోయిన సీతను రాముడేలుచున్నాడు' అని నిందించిరి. ఆ అపనిందకు మనస్సులో బాధపడి నిన్ను వదలుమని నన్నంపినాడు. మహాతపోనిధులైన మునులకాలవాలమైన దీతపోవనము. ఇక్కడినుండి నీవిక జీవితవిశేషము కడుపుము. నీ సచ్చరిత్ర మెరిగినను, జననింద సహింపలేక నిన్ను విడిచిపెట్టుచున్నాడు. నీకోరిక నెపమున నిక్కడికంపినాడు. అతడీ విరహము నెట్లు సహింపగలడో? శత్రువులకైనను ఇట్టి కష్టమువచ్చిన చూడలేము. నిన్నిక్కడ విడచి నేనెట్లు వెళ్ళుదును? నన్నిట్టి కష్టపువనికి రాముడేల నియమించెనో? ఇట్టు కతిసచిత్తుడు; ఎట్టిపనినైనను చేయునని నియమించెనేమో.

అంతఃపురములో నుండవలసినదానవు; క్రూరమృగముల కాలవాలమైన ఈ అడవులలో ఎట్లులుండుదువమ్మా? 'నీవు మహాపతివ్రతవు. నీతోసాటి యెవ్వరును లేరు.' అని నిన్ను పొగడుటకు కూడ నాకు సిగ్గగుచున్నది. నిన్నొంటరిగవదలి వెళ్ళుచు నేనెట్లు పొగడుదును? నా కింటికేగుటకు సెలవిచ్చెదవా?" అని మెల్లమెల్లగా చెప్పునాతని మాటలు విని సీత మెల్లగా గాలికొరిగిన అరటిచెట్టువలె నేలపైపడెను రెండుగడియలకు తనంత తానే మూర్ఛ తేరినది. కన్నులువిప్పినది. కాని కన్నీళ్ళతో అవి మరల నిండిపోయినవి. ఆమె ఒడలుడికిపోయినది; పెదవి ఆర్చుకొనిపోయినది. కంఠము రుద్ధమైనది. ఒక్కసారి ఏడ్చును; ఒక్కసారి మౌనముతో నుండును; మరొక్కసారి తనలో తాను నవ్వుకొనును; తలయూచును; ముక్కుపై వ్రేలిడుకొనును అంతలో జాలిపడి 'ఆహా' కారము చేయును.

ఇట్లుండియు లక్ష్మణుని కేసిచూచి, 'నాయనా! నీ వేమియు విచారింపకుము. రాజాజ్ఞ మీరరాదు. నన్నిట్లు కష్టపడుమని బ్రహ్మ సృష్టించినాడు. అవిదాట నెవరితరము? ఆపదలు గడచి గట్టెక్కితి ననుకొంటిని, కాని తుదకిట్లు జరుగునని తలంపనైన తలంపలేదు. ఇట్లు దుఃఖము కల్గించుటకే కాబోలు నాకట్లు కోరికపుట్టించినాడు. పూర్వజన్మమున ఏ జంటలను విడదీసితినో, ఆపాప మూరకపోవునా? ఆనాడు అడవులపాలైనను రాముని పాదములు చేరినందున నాకు కష్టమనిపించలేదు. ఇప్పుడిట్లనాథనైతిని. నేను పతివ్రతనని జనులందరును కొనియాడుదు రనుకొంటిని, కాని ఇట్టు లపనింద లాడుదురనుకొనలేదు. నేనెంత

రాతిగుండెదాననో. ఇట్టి పిడుగువంటివార్త విన్నను నాగుండె పగులలేదు. నీవు జాగ్రత్తగా విన్నావా? రాముడట్లి యాజ్ఞాపించెనా? నీవు భ్రమపడలేదుకదా ? లేదు. నీకు భ్రాంతి యెందుకు కల్గును? ఇక నేను శ్రీరాముని చూడకల్గుదునో, లేనో? చూడకల్గకపోయిన కల్గునష్టమేమి? ఎదురుగా గంగాదేవియే యున్నది. ఎట్లైన అట్లులగును. ఇదివరకు అశోకవనములో అన్నాళ్లు బ్రతికినదికదా, ఇప్పుడెందులకు బ్రతుకదనుకొన్నాడేమో. అప్పుడు మరల భర్తను కలిసికొందునని యాశయైనను ఉన్నది. ఇప్పుడేయాశ పెట్టుకొని జీవింతును? ఎవరో మూర్ఖులాడిన అపవాదులకు భయపడి వెంటనే నన్నడవులకు త్రోసెను, కాని నన్నుపిలచి అదియంతయు చెప్పి నా మనోబాధతీర్చి నిన్ను మరువనని చెప్పిపంపలేదుకదా! ఇదివరకున్న దయ, ఆ అభిమానము, ఆ ప్రేమ, ఆ మంచిమాటలు ఈ అపవాదముతో అడుగంటినవేమో? శ్రీరామచంద్రుని ముఖము సుందరమై ఎప్పుడును చిరునవ్వులు వెదజల్లు ఆ ముఖము చూచుభాగ్య మీజన్మకున్నదో; లేదో? ఆనాడే అనుమానముతో అగ్నిపరీక్ష చేయించెనే, అప్పుడు దేవతలెల్లరు ఏకకంఠముగా చెప్పినమాటలు మరచెనా? మగనివిడచి ఒంటరిగా వనమున కేలవచ్చితివని అడిగిన మునిపత్నుల కేమని జవాబిత్తును? క్షణమొక యుగములాగున గడచు నాజీవితము నికనెట్లు వెళ్లింతును?' అనుచు విచారముతో కొంతసేపు చిత్రప్రతిమలాగున నిలబడి, తెంపుచేసికొని, 'లక్ష్మణా! దుఃఖములో నే నేనేమో అన్నాను. అవన్నియు లెక్కసేయకుము.

భర్తృవియోగమునకు జడిసి రామచంద్రుడు నపవాదులో మునుగచేయను. అతని యాజ్ఞ సేయుము. నీవింటికి వెళ్లి, ముగ్గురత్తలకును మ్రొక్కితినని తెల్పుము. శ్రీరామచంద్రునకు నా మాటగా నమస్కారము తెల్పుము. తనకపనింద సోకకుండ, తన యాజ్ఞనొప్పున అడవులలోనే సంచరింతునని తెల్పుము. నామనస్సులో ఎప్పుడును తన మూర్తియే భాసించుననుము. భార్యగా కాకపోయినను ఒక సామాన్య ప్రజగానైనను నా మీద దయయుంచుమనుము. పోయిరమ్ము.' అని కన్నీరు కార్చుచుండెను.

అంత లక్ష్మణుడు ఆమెకాళ్ళకుమ్రొక్కి, ఆవునువిడువ లేని దూడవలె భోరున యేడ్చుచు 'ఓ తాపసులారా! జానకి నిక్కడ దిగవిడచిపోవుచున్నాను. ఈమెను రక్షింపుడు.' అని కేకలుపెట్టి, తిరిగితిరిగి చూచుచు నావనెక్కి గంగదాటి, రథ మెక్కి సుమంత్రుని త్రోలుమనెను. సీతయు కనుచూపారిసంత మేర రథము నట్టేచూచుచుండెను. అట్లు చూచి, చూచి రథ మగపడకుండపోగానే, మనస్సులోని బాధ హెచ్చుకాగా ఆమె మూర్ఛపోయెను. తిరిగి కొంతసేపటికి తనంతట తానే తెలివొంది శ్రీరాముడు తన్నిదివరకు ప్రేమతోచూచినప్పుడు చేసిన చేష్టలను తలచుకొనుచు ఏడువసాగినది.

ఆమె అట్లుండగా వాల్మీకిమహర్షి శిష్యులు కొందరు ఫలములకై ఆవనమునకు వచ్చి, ఆమెనుచూచి, గురువుగారినద్ద కేగి, 'అయ్యా! లక్ష్మీదేవియో, శచీదేవియో, కాని అతిదీనయై వనములో విలపించుచున్నది. ఆమెను రక్షింపుడు' అనుటతో ఆ

మహాముని దివ్యదృష్టితో చూచి, నిజమెరిగి 'ఆమె రఘురాముని భార్య! సీతామహాదేవి. ఆమె నిక్కడకు తోడితేవలెను' అని అర్ఘ్యపాత్ర తీసికొని, శిష్యులు వెనుకవచ్చుచుండగా అతడామెను సమీపించెను. అంత నామె కన్నెత్తి చూచి, కన్నీరు కారుచుండగా, భోరున యేడ్చుచు, అతని పాదములపై పడినది. అప్పుడాత డామెను బుజ్జగించి, 'తల్లీ! విచారించకుము. నీ భర్త నీ పాతివ్రత్యము నెరుగును. కాని జననిందను సహింపలేక ఇట్లు చేసినాడు. అదియంతయు నేను చూచితిని. నాకును జనకునకును భేదములేదు. ఎరమరిక లేకుండ నా యాశ్రమములో సుఖింపుము. ఇచ్చట మునికాంతలు నీకుపచారములు చేయుదురు. వివేకవంతురాలైన నీవంటివారు ధైర్యమును విడనాడరాదు, దైవగతిని తప్పింపలేము కదా? అర్ఘ్యమిదిగో గైకొనుము. అమ్మా! జలములు చేకొనుమమ్మా! నీ ముఖము కడిగికొని యాశ్రమమునకు రమ్మమ్మా' అని బ్రతిమాలి ఆమె కర్ఘ్య మిప్పించి, తన యాశ్రమమునకు తోడుకొనిపోయెను.

ఆమెను చూచుటకై అచ్చటి మునిపత్నులు రాగా వాల్మీకి 'ఈమె రామునిభార్య; సీతాదేవి. మహాపతివ్రత, చూలాలు. శ్రీరాముడు జనులాడుకొను అపనిందలకు సహింపజాలక ఈమెను వనముల కంపినాడు. మీరందరును ఈమె కుపచారములు చేయుచు రక్షింపుడు' అని ఆమెను వారల కప్పగించెను. వారు మహాప్రసాదమని ఆమెను తమ పర్ణశాలలకు తోడ్కొనిపోయి వంతులుగా ఆమెకు సేవలు చేయజొచ్చిరి.

నారి మర్యాదలతో ఆమె కష్టము మరచినది. వాల్మీకికి సంతోషము కల్గినది. పట్టుబట్టలను కట్టుకొను నామె ఇప్పుడు నార చీరలను కట్టినది. రాజభోజనములను తినునది, కందమూలముల భుజించుచున్నది. మెత్తనితల్పములపై పరుండెడిది, కటిక రాలపై నిద్రించుచుండెను ఏ గడియ కెట్లు జరుగునో ఆ విధి విలాసమును నెవ్వరును తెలిసికొనలేరు కదా !

అచ్చట లక్ష్మణుడు రథమెక్కి వెళ్ళుచు 'సుమంత్రా! సీతకెట్టి దుర్దశ వచ్చినదో చూచితివా ? ఆమెను రాముడు వదలినాడు. ఆ దుఃఖములో నామె యెక్కడ ప్రాణము విడుచునో ? ఇదివర కెన్నిపాట్లు పడినది ? ఆమెకై శ్రీరాముడెంత శ్రమపడినాడు ! నేటి కిట్లు నిష్కరుణుడై వదలినాడు కదా ! ఆ ఉసురు జనులకే తగులునో ? రాజునకే తగులునో కదా !' అనుటతో సారథి 'లక్ష్మణా ! కాలగతికి సుఖదుఃఖములు వచ్చుచుండును. దానికై వగవ బనిలేదు. దీనికి కారణమున్నది చెప్పెదను వినుడు.

పూర్వమొకప్పుడు మీరందరు పుట్టినాక దశరథుడు వసిష్ఠుని చూచుటకై తపోవనమున కేగినాడు. అప్పుడును నేనే రథము తోలినాను. అప్పుడచట నేడాదిపాటు సత్రయాగము జరిగినది. అచ్చటికి దుర్వాసుడును వచ్చియున్నాడు. వసిష్ఠుడు దశరథుని చూడగానే ఆతిథ్యమిచ్చి గౌరవించెను. అంత రాజు దుర్వాసునికి మ్రొక్కి 'మహాత్మా! మా శ్రీరాముడు ఎన్నాళ్లు రాజ్యము సేయును? అని, భావిజీవితమెట్లు జరుగును ?' అని ప్రశ్నించెను. అప్పుడతడు త్రికాలజ్ఞుడు కాన 'రాజా ! సీ

కుమారుడు పదునొకండువేయేండ్లు రాజ్యము చేయును. అతని కిద్దరు పుత్రులు పుట్టెదరు. చివరి కతని పెద్దకుమారుని అయోధ్యకు రాజుగా జేయును. బంధుమిత్రాదులతో బ్రహ్మలోకమున కేగును. తక్కినవారి కిద్దరేసి పుత్రులు పుట్టుదురు. వారు మరొకరాజ్యము లేలుదురు. ఇక్ష్వాకువంశము చిరకాలము వర్ధిల్లును. మరొక్కవిశేషమును. రాముడు సీత నెడబాసి రాజ్యము చేయును. ఆ విరహమునకు కారణమేమనగా? పూర్వము రాక్షసులు దేవతలబాధల కోర్వలేక భృగుమహర్షి భార్యను శరణువేడిరి. శ్రీ మహావిష్ణువు దేవతలమాటపై ఆమెను చంపివేసెను. అప్పుడు భృగుమహర్షి 'ఆడుది యని యైనను విచారింపక స్త్రీహత్యచేసి నాకు పత్నీవియోగము కల్పించితివి; కాన నీవును నా వలెనే చిరకాలము పత్నీవియోగమున బాధపడుదువు' అని శపించెను. ఆ శాపము ననుభవించుటకై శ్రీరాముడు నీకు కొడుకుగా పుట్టినాడు. అందుచే అది అనుభవించితీరును.' అని చెప్పెను హరియైనను, హరుడైనను, బ్రహ్మయైనను మహర్షి శాప మనుభవింపక తీరదుకదా! కాన శ్రీ రాముడు శాపము నిప్పు డనుభవించుచున్నాడు. ఆ కథ తిరిగి వచ్చునపుడు నాతో మహారాజు చెప్పినాడు. ఈ విషయము మా యిద్దరికే తెలియును. నీ వెవరికిని చెప్పకుము. మాటల ప్రసంగములో చెప్పినాను.' అని సుమంత్రుడు మునివాక్యముల చెప్పగానే లక్ష్మణు డాశ్చర్యపోయెను. అప్పటికి వారు గోమతి చేరిరి.

మరునాడుదయముననే బయల్దేరి మధ్యాహ్నమగు సరి

కయోధ్యను చేరిరి. రథములో సీతలేదు. విచారముతో లక్ష్మణు డున్నాడు. పురజను లదిచూచి గుంపులుగూడి 'ఎంతపని జరిగి నది మనమనుకొన్నంతయు జరిగినది. మంచి చెడ్డలేక ప్రజలు ఎద రేదను పండువంటి కాపురము నీటకలసినది. రాము డెంతపని చేసి నాడు ? చూలాలనియైనను దయచూపక అరణ్యములో విడచి నాడు. రాజధర్మ మతి కఠోరము. వారికి దయయుండదేమో? వదలకేమి చేయును ? భార్యకై వంశమర్యాదను భగ్నము చేయునా ? ఇందరున్నను దిక్కులేనిదైపోయిన దా తల్లి. తన మగ డందరిని రక్షించునే కాని తనవంక చూడడుకదా ! ఆ చల్లనితల్లి నన్న వా రెన్నాళ్ళు సుఖింతురో ?' అను జనుల గుసగుసలు వినుచు దీనవదనుడై లక్ష్మణుడు రాముని మొగ శాలవద్ద దిగి లోనికేగెను.

అచ్చట రాముడొంటరిగా పక్కపైబడి దొర్లుచుండెను. జానకి లేనియిల్లు కాంతిలేని అద్దమువలెను, కొమ్మలులేని చెట్టు వలెను, పద్మములులేని కొలనువలెను, దీపములేనియిల్లువలెను, కళావిహీనమై గోచరించినది. లోనికేగెను. సుఖమనుమాట ఇక నుండదని శోకమూర్తియై రాముడు పొరలుచున్నాడు. లక్ష్మ ణున కాతని చూచుసరికి విచారమాగలేదు. భోయనయేడ్చి, అన్నగారి పాదములకు నమస్కరించగా, రాముని కన్నీళ్ళతో అతని తలయు, అతని కన్నీళ్ళతో రాముని పాదములును తడిసి నవి. 'రామా! నీయాజ్ఞ శిరసావహించి సీతమ్మను అడవులలో దిగవిడచి వచ్చినాను. సుఖదుఃఖములు కనేరికి పర్యాయముగా వచ్చుచుండును. మీవంటి మహాత్ములకు ధైర్యము విడనాడ

తగునా? నీవు విస్మయమూర్తివి. నీకు నే చెప్పెడిదేమున్నది? ఏదో జ్ఞాపకముచేయుట. అంతే. నిన్నుచూచినవారికే దుఃఖము కల్గదన్న నీకెట్లు కల్గును?' అని తనకు తోచినరీతి ధైర్యవచనములు పల్కగా రాముడు కలకతేరినాడు. అతనికేసి నిర్మలముగాచూచి 'తమ్ముడూ! నీవుచేసిన బోధతో నామనస్సులోని కల్మషమంతయు పోయినదోయి. సంతోషము కల్గినది. మనము సభకు వెళ్ళి నాల్గురోజులైనది. లేవయినను సభలోని కేగనిచో రాచకార్యము లేమగును?' అనుటతో లక్ష్మణునకు నానందము కల్గినది. తనమాటలతో తేరుకున్నట్లు రాము డగపడినాడు. తాను కోరినదికూడ అదియే కదా!

అంతరాముడు 'లక్ష్మణా! సుజనులను రక్షించుచు, దుర్జనుల శిక్షింపుచు న్యాయముగా రాజ్యమేలినవానికి స్వర్గసుఖములు కల్గును; ఇచ్చట నందరును కీర్తింతురు. అట్లుగాకున్న ఇచ్చట జననింద; పథమున నిరయమును తప్పవు. దానికి తార్కాణముగా నొక్కకథ చెప్పెదను. వినుము.

## నృగమహారాజు కథ

పూర్వము నృగుడను రాజు నిత్యమును కొన్నివేల గోవులను దానము చేయుచుండెను. ఒకప్పు డొక బ్రాహ్మణుని యావు తప్పిపోయినది. అతడు దేశదేశములు తిరిగి వెదకెను. తుదకొక్కచోట బ్రాహ్మణునియింట తన యా వగపడినది. అతడు కేక వేయగానే అది వచ్చి అనినిని నాకుచు, చనవు చూపినది. ఆవుదూడయు దొరకినది కదా! ఇంకను మరొక

రితో పనేమున్నది ?' అని ఆవును, దూడను తోలుకొనిపోవు చుండెను. అంత దాని దానము పట్టిన విప్రుడు వచ్చి 'ఓయి బ్రాహ్మణుడా ! తిన్న యింటివాసములు లెక్కపెట్టుచున్నావే? నా ఆవు నేల తోలుకొనిపోవుచున్నావు ?' అని అడ్డగించెను. అతడు 'నీదైన నేనెందులకు తోలుకొనిపోదును ? ఇది నాదే. దీనికై యెన్నోగ్రామములు వెదకి విసిగి వేసారితిని. చివరికిది యిక్కడ కన్పడినది. తోలుకొనిపోవుచున్నాను.' అనగా 'నీ వన్నదేనిజమా ? దీనిని రాజు నాకు దానమిచ్చినాడు. నేను ప్రతిగ్రహించినాను. అతనినే అడుగుదము.' అని యిద్దరును రాజద్వారమునకు వెళ్ళిరి. అక్కడ ఎన్నాళ్ళున్నను రాజదర్శనము కాలేదు. అంతట వారు కోపగించి 'ఊసరవెల్లి (ఉడుము) వగుగాక!' అని నృగమహారాజును శపించి వారు వెడలిపోయిరి. ఆమాటను భటులు రాజునకు తెల్పిరి. అప్పుడు పశ్చాత్తప్తుడై కుమారునికి పట్టముగట్టి, యుద్యానవనములో పుట్టలు, పొదలు నిర్మింపజేసి, అతడుడుమై అక్కడ విహరించుచుండెను. కాన ప్రజలమనవి యాలకించకపోయినను ప్రమాదమే. మత్తుడైన వాని కట్టి హానికల్గును. అంతటి మహాదాత కాగతివట్టినది. చూచితివా ?' అని మరియు, ఇట్లు మత్తుడైకదా నిమియను రాజు గురుశాపము నందెను.' అనెను. లక్ష్మణుడా కథను చెప్పుమని వేడగా శ్రీరాముడు చెప్పదొడగెను.

## ని మి క థ

కృతయుగమున సూర్యవంశజుడైన నిమియను మహారాజు కలడు. అతడొక నగరమును నిర్మింపజేసి దానికి 'వైజ

యంత'మని పేరుపెట్టెను. దానిని ధర్మముతో నేలుచుండెను. అంత నొకప్పు డతనికి యజ్ఞముసేయ బుద్ధిపుట్టినది. తన కులగురువైన వసిష్ఠునిపిలిచి యజ్ఞముచేయింపుమని కోరెను. అతడు తా నంతకుముందే నిమంత్రితుడై యున్నందున ఇంద్రుని యజ్ఞము చేయించివచ్చి నీ యాగము చేయింతుననెను. అతడా మాటలకు కోపించి 'ఇతడే గతియన్నట్లు ఇతడు వచ్చువరకు నేనాగ వలెనట. మరొకరిచే చేయింతున'ని తలచి గౌతమ మహర్షిని అధ్వర్యుడుగా వరించి, భృగువు, అత్రి, చ్యవనుడు మొదలైన మహర్షుల రావించి చిరకాలము దీర్ఘసత్రయాగము చేసెను. అందు అడిగినవానికి లేదనకుండ దానములుచేసెను. యథావిధిగా హోమములు చేసెను. దానితో దేవతలు, ప్రజలును సంతోషించిరి.

అంతలో మధ్యలోనే ఇంద్రునియాగము పూర్తియగుటచే వసిష్ఠుడువచ్చి నిమి మహారాజువాకిట నిలువబడెను. ఆ రోజున అతని దురదృష్టవశాత్తు నిమి పట్టపగలే నిద్రపోవుచుండెను. ఇతడు వచ్చినసంగతిని గుర్తింపలేదు. అప్పుడు వసిష్ఠునకు కోపమువచ్చినది 'నన్ను గురువుగా నెన్నుకొని కాలహరణము సైపజాలక, ఇంతలోనే మరొక్కరిచే యజ్ఞము చేయించుకొన్నాడు. నాకు ముఖమైనను చూపలేడే? ఇంతగర్వమా?, అని ఉగ్రుడై 'ఇతని స్థూలశరీరము నశించుగాక! సూక్ష్మశరీరముతోనే తిరుగుగాక!' అని శపించెను. ఆ ఘోరశాపవశమున అతడు వెంటనే సూక్ష్మరూపధారియై జరిగినసంగతి తెలిసికొని 'గురువై యింతమాత్రాన ఇంతగర్వమా? నేనుమాత్రము శపింప

లేనా?' అనుచు 'నావలెనే అతడును సూక్ష్మరూపియే యగుగాక!' అని ప్రతిశాపమిచ్చెను. వసిష్ఠుడుకూడ సూక్ష్మజీవియై తన కోపమున నింతయు వచ్చెనని వగచి బ్రహ్మలోకమునకేగి జరిగినదంతయు విన్నవించెను. తనకు స్థూలరూపము వచ్చునట్లను గ్రహింపుమని కోరెను. అంత బ్రహ్మదేవుడు మిత్రావరుణుల యనుగ్రహమున నీకు స్థూలదేహము కల్గును పొమ్ము' అని చెప్పిపంపెను. వసిష్ఠుడు వరుణలోకమునకేగెను.

అంత మిత్రావరుణులు పశ్చిమసముద్రతీరమున వనములో విహరించుచుండిరి. ఊర్వశియు నచటికి విహరింప వచ్చెను. ఆమె అందమునకు మోహితుడై మిత్రుడామెతో భోగించెను. ఆమె యాతని వీర్యమును గ్రహించి కుండలో వేసినది. అంత వరుణుడుకూడ ఆమెను మోహింపగా ఆమె 'మిత్రుడు నన్ననుభవించినాడు. నీవు తప్పులేదనితోచిన నన్ను కూడుము' అని చెప్పిన, అతడు మోహము నాపజాలక ఆమె ననుభవించెను. అతని వీర్యమును గ్రహించి యామె ఆ కుండలోనే వైచినది. అందుండి అగస్త్యుడు, వసిష్ఠుడును పుట్టిరి. మిత్రుడు వరుణునితో కలిసిన యూర్వశినిచూచి 'నీవు మంచి చెడ్డలు లేకుండ ఇద్దరితో కలిసితివి కాన భూలోకమందే కొన్నాళ్ళుండిపోదువు. నిన్నొక మహారాజు చేపట్టును.' అని శపించెను. ఆమెను పురూరవుడు పరిగ్రహించెను. వసిష్ఠుడట్లు స్థూలకాయము కలిగి, అయోనిజుడై వెడలిపోయెను.

మునులెల్లరును నిమి స్థూలకాయమును పాడుకాకుండ జాగ్రత్తపెట్టి యాజకులై యజ్ఞమును పూర్తిచేసిరి. అంత

దేవతలు సంతోషించి 'రాజా! నీకేమి వరము కావలెనో కోరు కొమ్ము' అనిరి. అతడు 'సూక్ష్మరూపముతో మనుజుల కన్నులపై నుండునట్లు కోరెను. అందుచేతనే రెప్పపాటునకు 'నిమిషము' అని పేరువచ్చినది. తరువాత మునులు నిమి దేహమును మథించిరి. అందుండి జనకుడు పుట్టెను. దేహము లేనివానినుండి పుట్టినవాడగుటచే 'విదేహు' డనియు, మథించగా పుట్టినందున 'మిథి' యనియు జనకునకు పేరువచ్చినది. అతని పట్టణమునకు 'మిథిల' అనియు, దేశమునకు 'విదేహదేశము' అనియు పేరు కలిగినది. అందుచేత కోపమంత చెడ్డదిలేదు. ప్రతిశాపమిచ్చినందున అతడట్లే యుండిపోయెను. ప్రతిశాప మియ్యనందున యయాతి పుణ్యలోకము లందెను.' అని చెప్పుటతో అదెట్లు జరిగెనో చెప్పు'మని లక్ష్మణుడు కోరెను. శ్రీరాముడు చెప్ప దొడగెను.

## యయాతి కథ

నహుష చక్రవర్తికొడుకు యయాతి. అతడు వృషపర్వుడను రాక్షసరాజపుత్రిని శర్మిష్ఠను, శుక్రుని కుమార్తె దేవయానను పెండ్లాడెను. శర్మిష్ఠకు పూరువును, దేవయానకు యదువు కలిగెను. యయాతి శర్మిష్ఠయందే మిక్కిలి మక్కువతో నుండెను. అది గమనించి యదువు తల్లికి దుర్బోధ చేయగా నామె తండ్రికడకు విచారముతో నేగెను. అంత శుక్రుడు 'అమ్మాయీ! ఇంత విచారమేల? ఏమి వచ్చినది?' అని అడుగుటతో ఆమె తనభర్త తన్ను ప్రేమతో చూచుట లేదని చెప్పినది. శుక్రుడు కోపించి అట్లైన అతని యౌవన

మదము తగ్గింతును. అతనికి ముసలితనము వచ్చుగాక! అని శపించెను. అప్పుడు దేవయాని 'ఇదేమి తండ్రీ! అతడు ముసలి వాడైనచో నాకేమిలాభము? మొదటికే మోసమువచ్చినదే?' అనగా అతడు 'అన్నమాట తిరుగదు. కాని యొకటి చెప్పెదను. ఎవరివద్దనుంచియైనను మార్చుకొనవచ్చును.' అని సడలించెను. ఆమెవెళ్లి భర్తకా విషయము చెప్పెను. అతడు కొడుకునుండి యౌవనమును తీసికొని కొన్నాళ్లు సుఖించి, తరువాత కుమారునకే పట్టముకట్టి తపోవనమున కేగెను. కాన కోపము పూనక శాపమునకు ప్రతిశాప మియ్యక సహించినందున యయాతికి సద్గతి కలిగినది. ఓర్పుమంచిది. వడ్డవాడెవ్వడును చెడ్డవాడు కాడు.' అని శ్రీరాముడు చెప్పి యా రాత్రి వెళ్లించెను.

## శ్రీరాముడు కుక్కకు న్యాయము చేయుట

మరునాడు శ్రీరాముడుసభాస్థలి కేతెంచి సింహాసనాసీనుడై మొగసాలలో ఎవరైనను న్యాయమునకై వేచియుందురేమో పిల్చుకొనిరమ్మని లక్ష్మణు నంపెను. అతడువెళ్లి, 'శ్రీరాముడు ప్రజల తగవులు వినుటకు సిద్ధముగా నున్నాడు. రండు.' అని కేకపెట్టెను. అంత వారు రామరాజ్యమున మాకు తగవులేమున్నవి? శ్రీరాముని చూచుటకై వత్తుమనిరి. ఇంతలో తల పగిలి నెత్తురు కారుచున్నందున ఏడ్చుచు ఒకకుక్క వచ్చెను. దానిని చూచి లక్ష్మణుడు 'ఎందుల కేడ్చుచుంటివ'నగా అది 'నేను శ్రీరామునకేగాని చెప్పను' అన్నది. లక్ష్మణుడు లోని కేగి అన్నకా వార్త తెల్పెను. అతడు వెంటనే 'దానిని లోనికి ప్రవేశపెట్టుమ'నెను. లక్ష్మణు డా మాటలు కుక్కతో చెప్పగా

అది 'ఇదేటి న్యాయము. మహాత్ములు, బ్రాహ్మణులు ఉన్న సభలోనికి నేను రానర్హునా? అతనినే ఇచ్చటికి రమ్మనుము.' అన్నది. లక్ష్మణుడా మాటలను రామునితో చెప్పెను. రాముడు వెంటనే ఈవలకు వచ్చి, 'నీకీ బాధ నేల కల్గినది?' అని కుక్క నడిగెను. అది 'భిక్షుకు డొకడు నన్నన్యాయముగ తల పగులగొట్టినాడు. న్యాయము చేయు'మని కోరినది. వెంటనే భటులను పంపి భిక్షుకుని రప్పించెను. అతడు వచ్చి రామునికి నమస్కరించి నిలువబడెను. రాముడు 'జరిగిన సంగతేమిటి? చెప్పుము' అనెను. అతడు 'నేను బిచ్చమెత్తుకొనివచ్చుచుండగా ఇది దారిలో అడ్డముగా నిలువబడినది తప్పుకొననందున కొట్టితిని. తప్పు నాదే. కాని నీవు నన్ను శిక్షింపుము. రాజదండన పొందినవారికి యమదండన యుండదు' అనగా రాముడతనికి ఏదో శిక్ష నిచ్చుటకు ఆలోచించుచుండెను.

ఇంతలో కుక్క 'కాలాంజనమను పర్వతముమీదనున్న దేవాలయమున కితని నధికారిగ చేయుము.' అన్నది. రాముడట్లే అతని కధికార మిచ్చెను. అంత జనులందరు 'ఇదేమిటి? శిక్షకు బదులు అధికారమిచ్చుటయా?' అనగా రాముడు 'ఆ సంగతి కుక్కయే చెప్పును.' అనెను. కుక్క ఆ మాట నందుకొని 'నేను క్రితము జన్మములో దేవాలయాధికారినే! ఆ దేవ ధనము తిన్నందుననే నాకీ జన్మ వచ్చినది. కొంతగా కొంత పుణ్యమాచరించినందున పూర్వజన్మజ్ఞానము కల్గినది. ఇతడు జాగ్రత్తగా మెలగిన పుణ్యము నందగలడు. లేదా నా గతియే.' అని చెప్పినది. అది విని ప్రజలెల్లరు ఆశ్చర్యపడిరి. కుక్క

కాశికిపోయి నిరశనవ్రతముతో దేహము చాలించి, సద్గతి నందెను.

## లవణాసురుని కథ

తరువాత నొక్కనాడు చ్యవనాది మహర్షులు రాముని సభకు వచ్చిరి. రాముడు వారిని తగురీతిని సత్కరించి, సుఖాసీనుల చేసి వచ్చినపని నడిగెను. వారును అతని దీవించి, వారు తెచ్చిన పవిత్రోదకముల నాతని కిచ్చిరి. అతడు వారిని మెచ్చుచు, ఆ ఉదకములను తలపై చల్లుకొని, లోనికి తీసికొనెను. అప్పుడు చ్యవనుడు 'రామా! కృతయుగమున మధువను రాక్షసుడు శివునిగూర్చి తపస్సుచేసి, శివుని మెప్పించెను. అంత శివుడు ప్రత్యక్షమై వరము కోరుకొనుమనగా త్రిశూలము మా వంశపారంపర్యముగ నుండునట్లు కోరెను. అందులకు శివుడు మరియొక త్రిశూలమును సృష్టించి, 'ఇది నీ కుమారునికి మాత్రమే సంక్రమించును. ఇది చేతులో నున్నంతసేపు అతని నెవరును జయింపలేరు. అతడు దీనిని మరచి యుద్ధమునకు వెళ్లినా, ఇది నన్ను చేరును.' అని వరమిచ్చెను. అతడు ధర్మమూర్తియై రాజ్యమేలెను. అతనిభార్య రావణుని చెల్లెలు కుంభీనస. అతనికి లవణుడను కొడుకు పుట్టెను అతడు తన యనంతరమున కొడుకునకా త్రిశూలమునిచ్చి, దాని మహిమ తెల్పెను. దానితో లవణుడు పట్టపగ్గములు లేక జనుల నందరిని బాధించుచుండెను. నీ వాతనిచంపిన, కాని మేము మనజాలము.' అనెను.

అంత రాముడు 'అతని ఆహార, విహారములేవి?' అని అడుగగా మహర్షి 'నూరుఏనుగులు, రెండునూర్లు గుఱ్ఱములు, పదివేల దుప్పులు, ఆరునూర్లు పశువులు, వెయ్యి చమరీమృగములు, ఒకలక్ష అడవిపందులు అయిన అతని కొక్క పూటకు సరిపోవును. మధువనమున అతడు సంచరించును. అతడు వేటాడి జంతువులను తినును' అని చెప్పెను. అంత రాముడు భరత, శత్రుఘ్నులకేసి చూచి 'ఎవరు వెళ్ళెదరు?' అనెను. భరతుడు తాను వెళ్ళెదుననెను. కాని శత్రుఘ్నుడు వెంటనే 'అత డీ పదునాలుగేండ్లు నందిగ్రామముననుండి అలసినాడు అందుచే నేను వెళ్లెదు'ననెను. అంత రాముడు 'నీపేరే శత్రుఘ్నుడు నీవు వెళ్లుటయే మంచిది! అని భటులను పట్టాభిషేక సంభారములు తెమ్మని 'శత్రువునుజయించి ఆ పట్టణమునకు నీవు రాజువుకమ్మ'ని అభిషేకము చేసెను. మునులు 'శ్రీరస్తు, రిపుజయ శ్రీరస్తు' అని దీవించిరి.

తరువాత రాముడు 'పూర్వము బ్రహ్మ మధుకైటభులను చంపుటకై ఒక దివ్యాస్త్రమును సృష్టించినాడు. అది నా వద్దనున్నది. ఈ అస్త్రముతో నీవు లవణాసురుని చంపుము.' అని ప్రయోగోపసంహారములతో ఆ మంత్రము నుపదేశించి, 'నాయనా! శూలము చేతిలో నున్నంతసేపు అతని నెవరును జయింపలేరు. అందుచే అతడు వేటకువచ్చినప్పుడు నీ వాంటరిగావెళ్ళి కలియపడుము. నీ సేనాసన్నాహములు చూచిన అతడు శూలము నేమరడు. యుద్ధమధ్యములో పట్టణములోనికి

పోకుండ చూచుకొనుము. జాగ్రత్త నీకు జయమగుగాక! పోయిరమ్ము! అని దీవించి పంపెను.

అతడు శ్రీరాముని పాదములకు నమస్కరించి, తన సేనలతో బయలుదేరెను. ఆరాత్రికి వాల్మీకి ఆశ్రమమునకు వెళ్లెను. అంత నా మహర్షి అతనికి స్వాగతమిచ్చి సేనలకు తగు విడుదు లేర్పాటు చేసి, కందమూల ఫలాదులతో విందు చేసెను. ఆ రాత్రియే సీత కవలలను కన్నదని మునిబాలకులు వచ్చి వాల్మీకితో చెప్పగా, అతడు కుశలవములనిచ్చి, మంత్రోదకములను వాటితో బాలురకు మార్జన చేయుమనెను. వారట్లు చేసిరి. అందుచేతనే ఆ బాలురకు కుశలవులని పేరుపెట్టెను. ఆ వార్త విని శత్రుఘ్నుడు చాల ఆనందించెను. మరునాడు ప్రొద్దుననే బయలుదేరి ఏడురోజులకు పశ్చిమసముద్రమును చేరెను. అచట చ్యవనుని ఆశ్రమమును చేరగా అతడు స్వాగతమిచ్చి, అతనికి సేవచేసెను.

అంత శత్రుఘ్నుడు 'లవణాసురుడు క్రూరుడంటిరే అతడింతవరకు వీరుల నెవరినైన చంపెనా?' అని అడిగెను. దాని కా ముని "నాయనా! అతని నెదుర్కొని బ్రతికినవాడెవడు? పూర్వము మాంధాతయను చక్రవర్తి దిగ్విజయముచేసి, ఇంద్రుని జయించుటకై బయలుదేరెను. ఇంద్రు డది తెలిసికొని, అతని గర్వమణగింపదలచి మాయవేషముతో వచ్చి, 'మహారాజా! మీ సన్నాహము చాల హెచ్చుగా నున్నది. భూమిలోనివారినందరిని జయించిన తరువాత కదా యింద్రుని జయించుట. మధుపుత్రుడు లవణాసురు డున్నాడు.

అతనిని జయించి రమ్ము.' అని చెప్పెను. అతడట్లే చేయదలచి లవణాసురునిపైకి పోయెను. అతడా యుద్ధమున శూలముతో ఒక్కదెబ్బకు సైన్యముతో సహా భస్మమైపోయెను. కాన నీవు మిక్కిలి మెలకువతో వెళ్లుము. నీకు రాముడే చెప్పియున్నాడు' అనెను. శత్రుఘ్నుడా రాత్రి గడపి, మరునాడు ప్రొద్దుననే లేచి, మధువనము చేరెను.

అచ్చటికి లవణాసురుడు వేటకు వచ్చెను. అతడు అలసి సొలసి మరలి వెళ్లునప్పుడు సమయముచూసి, శత్రుఘ్నుడాతనితో యుద్ధమునకు కలియబడెను. అతడు చెట్లతోను, శత్రుఘ్నుడు బాణములతోను ఘోరముగా పోరిరి. మధ్యలో శత్రుఘ్ను డొక్కసారి మూర్ఛపోయెను. అప్పుడు దేవతలు, మునులును భయపడిరి. కాని వారి యదృష్టవశాత్తు రాక్షసుడు గర్వముతో పట్టణములోనికి పోక, ఆకలిబాధ నణచుటకొరకై మృగములను భక్షించుచుండెను. ఇంతలో శత్రుఘ్నుడు తెప్పిరిల్లి, మరల బాణవర్షమును కురిపించుచుండెను. అప్పుడు ఈ బాణములవలన ఉపయోగము లేదని రాముడు చెప్పిన దివ్యాస్త్రమును ప్రయోగించెను. అది అగ్నిజ్వాలలు గ్రక్కుచు రాక్షసునిమీదికి వెళ్లినది. దానిని చూచుటతోడనే అతని ప్రాణములు పోయినవి. అది అతనిని భస్మముచేసి తిరిగి శత్రుఘ్నుని చేరినది. రాక్షసునివద్దనున్న శూలము మహేశ్వరుని చేరినది.

అట్లతడు లవణాసురుని చంపి, ఆ విజయవార్తను శ్రీరామునకు కందజేసి, పట్టణములోనికి ప్రవేశించెను. అతని కక్కడి ప్రజలందరును విధేయులై మ్రొక్కిరి. అతడా రాజ్యమును

వశపర్చుకొని పండ్రెండేండ్లు పరిపాలించెను. అంత నొక్కసారి శ్రీరాముని చూడ వేడుకపుట్టి శత్రుఘ్నుడు అయోధ్యకు బయలుదేరెను. దారిలో వాల్మీకాశ్రమమున విశ్రమించెను. అప్పటికి కుశలవులు పండ్రెండేండ్ల బాలురు. వారిద్దరును చక్కగా సంగీతము పాడనేర్చిరి. వాల్మీకి రచించిన రామాయణమును ఇద్దరును వీణలపై గానము చేయుచుండిరి. వారి కంఠమాధుర్యము శత్రుఘ్ను నాకర్షించినది. అతడు తదేకదృష్టిగా వారి పాటలు విని ఆనందించెను. ఆ గానము వినుటతో అతనికా రాత్రి ఒకక్షణములాగున గడచినది. మరునాడుదయముననే బయలుదేరి అయోధ్యను చేరెను. అప్పుడు శ్రీరాముడు కొలువుకూటము నలంకరించియుండెను. శత్రుఘ్నుడు సభలోనికేగి, శ్రీరామునికి నమస్కరించి, తాను తెచ్చిన రత్నరాసులను కానుకగా నిచ్చెను. అప్పుడు శ్రీరామునితో 'అన్నా! నీయాజ్ఞ చొప్పున శత్రువును చంపి అతని పట్టణము నేలుచు, ఈ పన్నెండేండ్లు నీకు దూరమైతిని. మిమ్ములను చూచు తలంపుతో వచ్చితి' ననెను. అప్పుడు రాముడు అతనిని దగ్గరగా తీసికొని 'నాయనా! బెంగటిలకుము. శత్రువధయు, భూసంరక్షణయు మన విధులు. నేనును నిన్ను విడచియుండలేను. వలసినప్పుడు వచ్చి చూచి వెళ్లుచుండనచ్చును. కాని నీవిచ్చట ఒక్కవారముమాత్ర ముండి నీ రాజ్యమున కేగుము. రాజులేని రాజ్యము అరాజకమై పాడగును.' అని హితవు చెప్పెను. అతడట్లు బంధుమిత్రుల కలసికొని, సంతోషముతో ఆవారము గడపి, రామునియాజ్ఞ చొప్పున తన రాజధాని కేగెను.

# శంబూకుని కథ

శ్రీరాముడు రాజ్యము చేయుచుండగా ఒకనాడొక వృద్ధ బ్రాహ్మణ దంపతులు చనిపోయిన అయిదేండ్ల బాలకుని తీసికొనివచ్చి, కోటముందు పారవేసిరి. 'అయ్యో! కుమారా! అయిదేండ్లకే నీకు నూరేండ్లు నిండెనా? ఎప్పుడైనను ఇట్టి అక్రమమున్నదా? రామరాజ్యమున అట్టి ఘోరము కలిగినదన్న ఇక చెప్పడిదేమి? ఇక మాకు తర్పణములిచ్చువారెవ్వరు? ఈ రాజ్యమున ఎక్కడో ధర్మచ్యుతి కలిగియున్నందున ఇట్టి అపమృత్యువు వచ్చినది.' అని బిగ్గరగా ఏడువజొచ్చిరి. అంతలో రాముడు ఈవలకు వచ్చెను. వారాతని చూచి 'రామా! నీ పరిపాలనలో ఇట్టి అపమృత్యువు వచ్చినది. ఈ బాలుడు పోయినతర్వాత ఇక మా బ్రతుకెందుకు? మేముకూడ ప్రాణములు విడుతుము.' అని యేడ్చిరి. వారి మాటలు విని 'మీరింతలో విచారము చెందవద్దు. దీనికి నేను ప్రతిక్రియ చేసెదను.' అని సభలోనికి వచ్చి, మహర్షులను కర్తవ్యముపదేశింపుడనెను. అప్పుడు నారదమహర్షి 'రామా! వర్ణధర్మములు వ్యత్యస్తములు అయినప్పుడు ఉత్పాతములు కల్గును. ఇప్పుడెవడో శూద్రుడు నీ రాజ్యములో తపముచేయుచున్నాడు. అందుచే నీ బ్రాహ్మణబాలుడు చనిపోయినాడు. నీవాతని చంపి, ఇతనిని బ్రతికింపుము.' అని బోధించెను.

అంత రాముడు 'సరే' అని లక్ష్మణునితో 'నీవు వెళ్ళి, అమృతబాలుని శరీరమును నూనెతొట్టిలో వేయించి, చెడిపోకుండ కాపాడుము. ఆ వృద్ధదంపతుల నూరడించుము.' అని

నియోగించి, పుష్పకవిమానమును తలచుకొనెను. అది వెంటనే వచ్చినది. పురరక్షణకై భరతశత్రుఘ్నుల నియోగించెను. కవచము తొడిగికొని విల్లమ్ములు, కరవాలము తీసికొని సుమంత్రాది మంత్రి పురస్సరముగా బ్రాహ్మణాశీర్వాదములు స్వీకరించి పుష్పకవిమానము నెక్కెను. దానిపైనుండియే హిమవత్పర్వత ప్రాంతమును, ప్రాక్పశ్చిమ సముద్రతీరములును కలయవెదకెను. వనములు, తీరములు, పట్టణములు, పల్లెలు ఎన్నో వెదకెను. తుదకొకచోట సరస్సు మధ్యమున యోగనిశ్చలుడై తలక్రిందుగా తపము సేయు నొక్కమునిని చూచెను.

అప్పుడు రాముడు అతని తీవ్ర తపశ్చర్యకు సంతసించి, పుష్పకము దిగి 'మహాత్మా! నీ వేజాతివాడవు? ఏమి కోరి తపము సేయుచున్నావు?' నేను దశరథుని పుత్రుడను. రాముడను. నిజము చెప్పుము.' అని యడుగగా అతడు 'రామా! సశరీర స్వర్గముకోరి ఇట్లు తపమాచరించుచున్నాను. శూద్రుడను. శంబూకుడను.' అని చెప్పెను. రాముని కద్భుతశోకంబు లొక్కసారి యులుకుకొన్నవి.' అట్టి వినయశీలుని ధర్మమునకై చంపవలసివచ్చె కదా!' రాజధర్మ మెంత నిష్ఠూరము!' అనుకొని కత్తిని తీసి ఒక్క వ్రేటుతో నతని శిరము ఖండించెను. ఎట్లైనను భగవత్ప్రసాదమే. అతని తపఃఫలముగా వేదవేదాంత గమ్యుడుగాని భగవంతుడు వెదకికొనివచ్చుటయు, నతనిచేతిలో చచ్చుటతో వెంటనే 'స్వర్గప్రాప్తియు కలిగినవి. అది ధర్మము కానీ, అధర్మముకానీ మంచివని యూరకపోవునా? సత్ఫలము నిచ్చినది. మహాత్ములెల్లరు జయజయధ్వానములు సేసి విమాన

ముపై దివికేగు శంబూకుని చూచిరి. అప్పుడు దేవతలు 'రామా! ఇతనికి స్వర్గమబ్బినది. ఇక నీ కోర్కె యేమి?' అనగా నతడు నేను 'బ్రాహ్మణ బాలుని బ్రతికింతునని మాట యిచ్చితిని. అది నిర్వర్తింపుడు' అని కోరగా వారు 'శ్రీరామ చంద్రా! నీ మాట కసత్యత్వ ముండునా? అతడిప్పుడే బ్రతికినాడు. ఉభయులకును లక్ష్యసిద్ధియైనది అని వారు 'ఇచ్చ టనే అగస్త్యుడు సత్త్రియాగము చేసి, యీ రోజున అవ బృధము చేసుకొనుచున్నాడు. 'నీవచ్చటికి వచ్చి చూచివెళ్ళ వలె'నననిరి. అత 'డట్లే' అని విమానముపై అగస్త్యుడున్న వనము వైపు వచ్చుచుండెను.

# బ్రహ్మదత్తుని కథ

అంతలో నొక గ్రద్దవచ్చి అతనికి నమస్కరించింది. దాని వెన్కనే గుడ్లగూబ వచ్చి నమస్కరించినది. ముందుగా గ్రద్ద 'రామా! నీవు సాక్షాద్విష్ణుడవు. నిన్ను పొగడ నా తరము కాదు. నే నిల్లు కట్టుకొనగా ఈ గూబ దాని నాక్రమించి నన్ను బాధించుచున్నది' అనెను. అంత గుడ్లగూబ 'శ్రీరామా! పరమేశ్వరుడవైన నిన్ను పొగడ నే నెంతటిదానను. నేను గూడు కట్టుకొనగా ఇదాక్రమించి నన్ను నిలువనిచ్చుటలేదు. తీర్పు చెప్పుము' అనెను. రాము డచ్చటివారితో 'ఏంటిరా? వీటిమాటలు?' అని వాటితో మీలో నెవరు ముందు కట్టిరో చెప్పుడ'నెను. అంత గ్రద్ద 'నేను బ్రహ్మపుట్టిననాడే ఇల్లు

కట్టుకొన్నాను.' అన్నది. గూబ 'నేను చెట్లు పుట్టినపుడే కట్టుకొన్నాను' అన్నది. అది విని రాముడు 'మంత్రివరేణ్యులారా! మీరు వింటిరి కదా! న్యాయము చెప్పుడు. ఇందే దోషము వచ్చినను అది తీర్పరులదే.' అనెను. అంత ఎనమండుగురు మంత్రులును బాగుగా నాలోచించి 'ఇల్లు గుడ్లగూబదే.' అనిరి. రాముడంత 'మీరు నా మనసులో నున్నట్లు చెప్పినారు. గ్రద్ద అబద్ధమాడినది. బ్రహ్మపుట్టినప్పుడు చెట్లే పుట్టలేదుకదా! ఇది గూడెట్లు కట్టుకొన్నది? విష్ణువు మధుకైటభులను చంపగా వారి మేధస్సుతో మేదిని తయారైనది. తరువాత చెట్లుచేమలు పుట్టినవి. అందు గూబదే న్యాయము. అన్యాయమున కొడబడిన గ్రద్దను చంపివైతునని కత్తినెత్తెను.

అప్పుడు శరీరవాణి 'రామా! దానిని చంపకుము. దీనికొక శాపమున్నది. పూర్వమిది బ్రహ్మదత్తుడను రాజు. ధర్మముతో భూమి నేలుచుండెను. ఒకప్పుడు గౌతమముని వచ్చి భిక్ష వేడగా నితడు మృష్టాన్నము పెట్టెను. అట్లతడు నూట ఇరువదై దేండ్లు భిక్ష చేకొనెను. ఒకనాడు అన్నములోనికి మాంసపుముక్క వచ్చినది. అది చూచి ముని కోపించి 'ఓయి దుర్మార్గుడా! మంచి చెడ్డలెరుగక నాకు మాంసము పెట్టితివి కాన, నీవు మాంసము తినెడి గ్రద్దవై చరింపుము' అని శపించెను. బ్రహ్మదత్తుడు 'ఇదేమి పొరపాటున వచ్చెనో కాని నాకు తెలియదు. ప్రమాదమునకు కూడ శపించిన నే నేమందును? మన్నింపుము' అని వేడుకొనగా 'నీకు శ్రీరాముడు ప్రత్యక్ష

మగును. అతడు చేయివేయుటతో నీ శాపము పోవును.' అని శాపాంతము సెలవిచ్చెను. కాన నీవు దానిని స్పృశించుము.' అనిన విని శ్రీరాముడు తనకుడిచేతితో దానినంటెను. అది వెంటనే బ్రహ్మదత్తమహారాజయినది. అతడు శాపవిమోచనమునకు సంతసించి, శ్రీరామునకు నమస్కారములు చేసి, అతనివద్ద సెలవుతీసికొని తన దేశమున కేగెను.

తరువాత విమానముపై నందరును అగస్త్యాశ్రమము చేరిరి. అగస్త్యుడు వారినెల్ల పూజించి శ్రీరామునితో 'రామా! యజ్ఞకర్తవు; భోక్తవు; అయిన నీవు నా యదృష్టము కొలది యాగఫలముగా యాగాంతమున కన్పట్టినావు! అని పొగడి అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించెను. అప్పు డగస్త్యుడు 'రామా! నీవు పిలవకుండగనే వచ్చి నన్ను తరింపజేసితివి నీకు నేనేమి యివ్వగలను. ఈ మణిహారము తీసికొనుము.' అని రత్నమయమైన ఆభరణము నియ్యబోయెను. అప్పుడు రాముడు 'మేము రాజులము కదా! ఇచ్చుటయే కాని పుచ్చుకొనవచ్చునా?' అనగా అగస్త్యుడు'రాజు లోకపాలుర అంశవలనపుట్టును. అందుకుబేరాంశచే దానప్రతిగ్రహములు రెండునూ కర్తవ్యములే.' అని చెప్పి శ్రీరామునకు ఆ భూషణమిచ్చెను. రాముడిది యెక్కడిది? చాల శోభాయమానముగా నున్నది. మీ తపోమహిమకు సాధ్యము కానిది లేదు; కాదు. కాని ఏదో సంశయము వచ్చి అడిగితిని.' అనుటతో ఆ ముని 'అడుగుట తప్పుకాదు. దీని పూర్వగాథ చెప్పెదను వినుము.' అని చెప్పదొడగెను.

# శ్వేతుని కథ

కృతయుగమున నేను తపస్సు చేసికొనుటకై చాల చోట్లు తిరిగి చివరికి దండకారణ్యమునకు వచ్చితిని. ఇచ్చట మృగములు, పక్షులు, జనులు ఎవ్వరును లేరు. ఇదేమా అనుకొని ముందునకు సాగుచుండగా అక్కడొక సరస్సు కనపడినది. అది చాల పెద్దది. దాని యొడ్డున ఒక మున్యాశ్రమమున్నది. 'ఇదియేల ముని శూన్యమయ్యెను?' అని ఆ రాత్రి అక్కడ గడిపితిని. తెల్లవారి సరస్సునకు స్నానమునకు పోవుచుండగా దానిలో ఒక శవము కన్పించినది. అది చాల పరిశుభ్రముగా నున్నది. అది యట్లు నశించకుండుటకు కారణము తెలియక నేనాశ్చర్యపడుచుండగా ఒక్క దివ్యపురుషుడు అంతలో విమానముపై నుండి దిగి శవము దగ్గరకు వచ్చి, దాని కండలు కోసికొని తినెను. ఆ సరస్సులో నీరు త్రాగెను. తిరిగి విమానమెక్కి బోవుసరికి నే నూరకుండక 'మహాత్మా! నీ వెవ్వడవు? దివ్యుడవైకూడ ఇట్లు మాంసమును తినుటయేటికి? ఇంత నిందితమైన పని ఏల చేయుచుంటివి?' అని యడిగితిని. అంత నతడు సిగ్గుపడి తలవంచికొని నాకు నమస్కరించి, వినయముతో ఇట్లు చెప్పెను.

'మునీంద్రా! విదర్భ దేశమును దేవుడను రాజు పాలించుచుండెను. అతని కిద్దరు భార్యలుండిరి. వారిద్దరికి శ్వేతుడు, సురథుడు అను ఇద్దరు కొడుకులు పుట్టిరి. అందులో శ్వేతుడను నేను. నాతండ్రి రాజ్యమును పాలించుచుండగా నేను మహా

దేశమునకు రాజునై పరిపాలించుచుంటిని. అట్లు చిరకాలము భూమి నేలి, నా తమ్మునకు రాజ్యమిచ్చివేసి, నే నీ తపోవనము నకు వచ్చితిని. ఇచ్చట నే ననేక వేలసంవత్సరములు తపస్సుచేసి దేవ త్వమును పొందితిని. తరువాతి దివ్యవిమానముపై నెక్కి ఈ దేవతాస్త్రీలు సేవించగా విహరించుచుంటిని. అంతట నాకపరి మితమైన ఆకలి వేసినది, దాహము వేసినది. దేవత్వము వచ్చి నను ఆకలి, దప్పులు వదలలేదని విచారించి బ్రహ్మదేవునివద్దకు వెళ్ళి అడిగితిని. అంతనాతడు 'రాజా! నీవు క్రితముజన్మలో ఒక్కమెతుకైనను విడవలేదు. ఒక్కనీటిబొట్టయినను పోయ లేదు. అందుచే నీవు దేవతవైనను, నీ ఆకలిబాధ తప్పలేదు. అందుచే ప్రతిదినము నీవు భూలోకమునకేగి, నీవు వదలిన దేహ మును తిని, నీరు త్రాగుచుండుము. నీ వెన్నాళ్ళుతిన్నను అది తరగదు.' అని చెప్పెను. అప్పుడు నేను చాల విచారించి 'దేవా! ఎన్నాళ్లు నే నిట్లు బాధపడుట?' అని దీనముగా అడిగి తిని అప్పుడతడు 'కొన్నేండ్లు గడచినతర్వాత అగస్త్య మహ ర్షితో నీవు మాట్లాడుదువు. అప్పటికిగాని నీ క్షుత్తృష్ణలు తీరును' అని సెలవిచ్చెను. అప్పటినుండియు నే నిట్లు చేయు చుంటిని.' అని 'మహాత్మా! మీ రగస్త్యమహర్షియేనా? మిమ్ము చూచుటతో నాకు తృప్తికల్గినది' అనెను. నేను 'ఔ నని' చెప్పుటతో అతడు బ్రహ్మానందమున 'నేటికి నా క్షుద్బాధ తప్పినది. ఇదిగో మీ ఋణము తీర్చుకొందును' అని మణులు గూర్చిన ఈ భూషణమును నాకిచ్చెను. అంత నా శవము మాయమైపోయినది. అతడు సంతోషముతో విమానముపై

వెడలిపోయినాడు. ఇది దీని వృత్తాంతము దీనిని నీవు గైకొన్న చో ఆ శ్వేతుడు అనంత పుణ్యఫలముల నందగలడు.' అని చెప్పెను.

# దండకారణ్య వృత్తాంతము

రాముడు 'మహర్షి శేఖరా! ఈ వనమిట్లు నిర్జనమగుటకు కారణమేమి?' అన, అగస్త్యు డిట్లు చెప్పదొడగెను. "సూర్య వంశమున మనువునకు కొడుకు ఇక్ష్వాకుడనువాడు కలడు. అతడు విద్యాబుద్ధులు నేర్చి పెద్దవాడైనాక మనువాతనికి రాజ్య మిచ్చి, తపోవనమునకేగెను. తరువాత నతడు సద్ధర్మముగా రాజ్యమేలుచుండెను. అతనికి నూర్గురు కొడుకులు పుట్టిరి. అందులో ఆఖరివాడు దండుడు. అతడు చాల దురాత్ముడై నాడు. తోడి బాలురను, కన్నతల్లిని కొట్టువాడు. ఏ వస్తువు కన్పించినను గంగలో పారవేయువాడు. పెద్దలను తిట్టి కొట్టును. ఈరీతిగా అల్లరిచేయుచుండగా చిన్నతనమని కొన్నాళ్ళు తండ్రి సహించెను. కాని అల్లరితగ్గలేదు. అప్పుడా మహారాజు నిష్పక్ష పాతముగా అతనిని వింధ్యాటవికి పారద్రోలెను. అత డక్కడికి పోయి మధుమంతమను పట్టణమునుకట్టుకొని, శుక్రాచార్యులు గురువు కాగా, రాక్షసులు అనుచరులు కాగా దుర్వృత్తితో రాజ్యమేలుచుండెను.

ఇట్లుండ అతడొక వసంతకాలమున శుక్రాచార్యుని ఆశ్రమ సమీపముననున్న వనమున కేగెను. అచ్చట శుక్రా చార్యుని పెద్దకూతురు 'అరజ'యనునది తపస్సుచేయుచుండెను

అత డామెనుచూచి కామించి, 'కలికీ! నీ వెవ్వరిదానవు? ఇట్టి నిండు యౌవనమున తపమేల చేయుచుంటివి?' అని అడుగగా ఆమె 'నేను శుక్రాచార్యుని పెద్దకూతురను, మోక్షముకోరి తప మాచరించుచున్న దానను' అనెను. అంత నతడు 'నన్ను పెండ్లాడుమ'ని కోరగా ఆమె 'శుక్రాచార్యు నడిగి చేసికొనుమ'నినది. కాని ఆ కామాంధుడు అంతవరకు నాగగలడా? ఆమెను బలవంతపెట్టెను. ఆమె 'గురుపుత్రికన'ని ఎన్నివిధముల చెప్పినను అతడు వినక, ఆమె నవమానించి వెడలి పోయెను.

తరువాత నామె ఏడ్చుచు తండ్రివద్దకు వచ్చెను. అత డామెనుచూడగానే 'ఏమమ్మా! అట్లున్నావు? నిన్నెవ్వరవమానించిరి?' అని ఆతురతతో నడుగగా ఆమె కన్నీరు కార్చుచు అతనిపాదములపైపడి జరిగినది చెప్పెను. అప్పుడాతడు ప్రళయ కాల రుద్రుడై పండ్లు పటపట కొరుకుచు ఎదుటనున్న శిష్యుల కేసిచూచి 'వింటిరా? దండు డెంతపనిచేసెనో? మంటతోడనా మిడుతకు చెలగాటము? ఆ దుర్మతి నేటి కేడురోజులు ఎడ తెరిపిలేకుండ మట్టి వాన కురియుటతో సేనాసమేతుడై నాశన మగును. అతని పట్టణము నేలపాలగును. అంతేకాదు ఈ పట్టణము నాల్గుమూలల నూరామడవరకు నిర్జనప్రదేశమగును.' అని శపించెను. చేసిన పాపకర్మ మూరకపోవునా? శుక్రాచార్యునిమాట ఫలించినది. మధుమంతము మట్టిపాలైనది. ఈ ప్రదేశమంతయు నిర్జనారణ్యమైనది. అని చెప్పి, అగస్త్యుడు 'నీవు వచ్చుటచే నా యజ్ఞము సఫలమైనదని అతని నెన్నో రీతుల

స్తుతించెను. మహర్షికి నమస్కరించి, సెలవుతీసికొని విమానముపై రాముడు అయోధ్యకేగెను.

అతడు విమానము దగ్గరికి మొగసాలనద్ద డిండిమములు ప్రయోగించిరి. భరత, లక్ష్మణులు స్వాగతమిచ్చిరి. పురోహితు లాశీర్వదించిరి. వారినందరిని తగురీతి సత్కరించి లోపలికి వెళ్ళి తల్లులకు నమస్కరించి, వారి దీవనలనందుకొని, తన మేడలో విశ్రమించెను.

## అశ్వమేధము: సంకల్పము

అంత నొకనాడు తమ్ములనుచూచి 'పూర్వము రాజులు రాజసూయ యాగము చేసినారు. అది చేసిన బాగుండునని తోచుచున్నది, మీ యుద్దేశ్యమేమి ?' అని యడిగెను. అంత భరతుడు 'పూర్వమింద్రుడు రాజసూయము చేసినప్పుడు దేవాసురయుద్ధమైనది. హరిశ్చంద్రుడు చేసినప్పుడు చాలమంది రాజులు చనిపోయినారు. అందుచే ప్రజాక్షేమము కోసు నీకు ఆ యాగము చేయదగదు.' అనెను. అంత లక్ష్మణుడు 'నీకు యజ్ఞముచేయ బుద్ధిపుట్టనేని అశ్వమేధయాగము చేయుము. అది చేసినందున ఇంద్రునకు వృత్రాసురుని చంపినందున వచ్చిన బ్రహ్మహత్యపోయినది. అట్టి సత్కర్మ నీకు చేయదగును.' అనెను. అది విని రాముడు 'నీవన్నట్లు అశ్వమేధయాగము మిక్కిలి ప్రశస్తమైనది. దానిని చేసియే ఇలుడను రాజు తనకు వచ్చిన స్త్రీరూపమును మాన్పుకొనెను.' అనుటతో లక్ష్మణుడు ఆ వృత్తాంతమును చెప్పుమని కోరెను. రాముడిట్లు చెప్పదొడగెను.

# ఇలుని కథ

కర్దముడను మహామునికి ఇలుడను కొడుకు కలడు. అతడు పరాక్రమశాలి; ధర్మమూర్తి; న్యాయముగా పరిపాలించువాడు. అంత నొకనాడు కోయలు వెదురుబియ్యములు, పునుగు, జవ్వాజి, కస్తూరి, పుట్టతేనె మొదలైన కానుకలు పుచ్చుకొని, రాజసభకు వచ్చి, రాజునకు నమస్కరించి, 'మహారాజా! మా యడవిలో క్రూరమృగముల బాధ యెక్కువగా నున్నది. వాటితో వేగలేకున్నాము. నీవా బాధను తీర్పుము' అనిరి. అంతట రాజా కానుకలను తీసికొని, వెంటనే వేటకు బయలుదేరెను. అడవిలో సింహములను వేటాడెను. పెద్దపులులను నరకెను; అడవిపందులను గ్రుచ్చెను. అతని సైనికులును అతని సాయమున నెన్నో మృగములను చంపిరి. వేటాడి వారందరు అలసిపోయిరి. అప్పుడందరును కైలాసపర్వతమునకు దగ్గరగా నున్న అడవిలోనికి వెళ్ళిరి. అక్కడికి వెళ్లినంతనే అందరు స్త్రీలైపోయిరి. గుఱ్ఱములన్నియు నాడు గుఱ్ఱములై పోయినవి. వా రాశ్చర్య చకితులైరి. అంతలో శివభక్తుడొకడు వచ్చి 'అయ్యా! ఇచటకు పరమేశ్వరుడు పార్వతీసహితుడై విహారమునకు వచ్చియున్నాడు. ఆయన, శాపముచే మీరందరును ఇట్లయినారు. వగవకుడు. పరమేశ్వరు డిచటే వచ్చుచున్నాడు' అనెను. అంతలో పార్వతీపరమేశ్వరు లచ్చటికి వచ్చిరి.

ఇలుడా మహాదేవు నెన్నో రీతుల స్తుతించెను. అతడు సంతోషించి, మగతనముతప్ప యేదైన వరము కోరుకొనుమనెను. 'నా కింకేదియు ననసరము లేద'ని రాజు పార్వతిని స్తుతించెను.

ఆమె 'రాజా! మేము అర్ధనారీశ్వరులము కనుక నీ కోర్కెకు అనురూపు ఉందునో అన్నాళ్లు మగతనము కల్గునట్లు వర మిచ్చినాడనెను. అతడు నెలకొకసారి మారునట్లు కోరెను. పార్వతి యట్లేయనెను. ఏ రూపమున చేసినపనులు, ఆ రూప మునసే కాని జ్ఞాపకముండదని చెప్పిపంపెను.

వారక్కడనుండి మరియొక వనమునకేగిరి. అంత బుధుడు వారిని చూచెను. అచ్చట కిన్నరులున్నారు. వారిని వరింపుడని సైనికులను పంపెను. ఇలా దేవి (ఇలుడు) రూప మునకు మోహించి తన్ను పెండ్లి చేసికొనుమనెను. ఆమె యట్లే బుధునివరించి కాలము గడిపినది. అంతలో నెల పూర్తి యైనది. ఇలుడు మగవాడై జరిగినదేదియు జ్ఞాపకములేక తన సైనికు లేమైపోయిరోయని బుధు నడిగెను. వారందరు చనిపో యిరి. నీవు నన్ను సేవింపుచుండుమని అతడు బోధించగా ఇలు డట్లే సేవించుచుండెను. ఆడదియైనప్పుడు భార్యగాను, మగవా డైనప్పుడు భక్తుడుగాను, బుధుని సేవించుచు ఇలు డక్కడే యుండెను. అంత నామె గర్భవతియై కొడుకును కన్నది. అతడే పురూరవుడు.

అంత ఇలుడు తనకు శాశ్వతముగా మగతనము వచ్చు నట్లు కోరగా బుధుడు మహర్షులను రావించి, అశ్వమేధ యాగము చేయించెను. అప్పు డీశ్వరుడు ప్రసన్నుడై ఇలుడు కోరినట్లు పూర్తిగా మగతనము నిచ్చెను. ఆ రీతిగా అశ్వ మేధము చేతనే ఇలుడు కామితార్థములను పొందెను, అని చెప్పి శ్రీరాముడు అశ్వమేధయాగము చేయుటకు సంకల్పించెను.

అందుకు వశిష్ఠాది మహాత్ములను రావించి, వారి యను మతిని అశ్వమేధయాగమును నడలి, దానికి రక్షకుడుగ లక్ష్మ ణుని పంపెను. యాగమును చూచుటకు నానా దేశపు రాజు లను, మునులను, విభీషణ, సుగ్రీవాది మిత్రులను పిలువ నంపెను శత్రుఘ్నునకు వార్తనంపెను. అందరును అయోధ్యకు చేరిరి. బ్రాహ్మణ క్షత్రియులకు పూజలుసేయుటకు భరతుని నియమించెను. యాగవస్తువుల నందించుటకు శత్రుఘ్నుని నియ మించెను. సుగ్రీవుని దానధర్మములకు నియోగించెను. క్రతు రక్షణకై విభీషణుని నియమించెను. పదార్థములను వేగముగా తెచ్చి యిచ్చుభారము హనుమంతునిపై పెట్టెను. ఇట్లా జగ ద్రక్షకుడు యాగముచేయదలచి అందరిని అన్నిపనులకు నియో గించి, కనక సీతాప్రతిమ చేయించి, ఆమెను ప్రక్కనునుంచు కొని దేవర్షి, రాజర్షి, బ్రహ్మర్షులు యాజకులుగా అశ్వమేధ మును చేసెను ప్రజలందరును చాలు చాలనువారే కాని కావలెనన్నవారు లేనేలేరు.

ఆ యజ్ఞమునకు వాల్మీకి నాహ్వానించెను. అతడు వచ్చి నాడు. రఘురాముడు వాల్మీకికి నమస్కరించి 'అయ్యా! మీా రీ యాగమున అవభృథము అగువరకు ఇక్కడ ఉండవలెన'ని కోరెను. అతడట్లేసమ్మతించెను. తనువ్రాసినరామాయణమును, నారదునొద్ద సంగీతమును నేర్చిన కుశలవులనుపిలిచి 'నాయన లారా! మీారిద్దరు వీణలుతీసికొని రామాయణమును యజ్ఞ శాలలోను, మునుల సభలలోను, వీధులలోను కలిసి పాడుడు. రోజున కిరువది సర్గలచొప్పున పాడుడు. ధనమును ప్రతిగ్ర

హింపరాదు. మీరెవరని రాముఁడడిగినచో వాల్మీకి శిష్యుల
మని చెప్పవలెను. అతనిని తండ్రిగా భావింపుఁడు. ప్రజలకెల్ల రఘు
రాజు తండ్రితో సమానుఁడు' అని చెప్పిపంపెను. వారట్లే
దేవాలయములలోను వీధులందును పాడిరి.

## కుశలవుల రామాయణ గానము

రాముని యజ్ఞశాలకు వెళ్ళి, రామాయణగానము చేయ
దొడఁగిరి. వారి సంగీతమాధురి యెట్టిదోకాని ఒక్కరైనను కద
లక మెదలక చిత్రప్రతిమలవలె పాట వినుచుండిరి. వారి పాటకు
రాళ్లు కరగినవి. విన్నవారి మనస్సులు కరగుట యొక
లెక్కయా? అంత హోమ సమయమైనది. రాముఁడు వారిని
చేతి సంజ్ఞ చేసి, పాటలాపుమని హోమములు పూర్తికాగానే
సభలోనికి రండనెను. అప్పుడా సభలో ఆ కవలలు వీణెల
మీటుచు వీనులవిందుగ పాడజొచ్చిరి. వారి ముఖ వికాస
ములుచూచి సభ్యులు 'వీరెవరి కుమారులో? ఇట్లేల ముని
రూపుల దాల్చినారో? కాక ఋషుల కింతటిసౌందర్య మెట్లు
వచ్చును? రాముని పోలియున్నారు.' అని గుసగుస లాడ
జొచ్చిరి. అది పెద్ద గొడవైనది. అంత లక్ష్మణుడు చేతిసంజ్ఞ చే
వారి రొద మాన్పించెను. అప్పుడు కుశలవులు చక్కగా
వీణలమేళవించి సంక్షేప రామాయణమును ప్రథమసర్గ మొద
లుగా ఇరువది సర్గలు పాడిరి. అందఱు 'అహా' అనిరి. శ్రీరా
ముఁడు చాల సంతోషించి భరతునితో, వీరికి పదివేల వరహా

లిచ్చి పంపుచుండెను. అంత వారు నవ్వుచు 'రాజా! కందమూలఫలములు తినుచు, అడవిలో మునివృత్తి గైకొనుచున్న మాకు ధనముతో పని యేమి? అనిరి. రాముడదివిని 'సౌమ్యులారా! మీరు పాడిన గ్రంథము ఎవరు వ్రాసినది? దాని పేరేమి? ఎందున్నది? మీకెవరు నేర్పినారు?' అనగా, వారు 'దీని పేరు రామాయణము. వాల్మీకిమహర్షి వ్రాసెను. ఇదియంతయు నీ కథయే. మొత్తమిరువది నాల్గువేల శ్లోకములున్నవి; ఐదువందల సర్గలున్నవి. పట్టాభిషేకమువరకు ఆరు కాండలు. ఆ పైగాథ ఉత్తరకాండ. ఆ మహాముని దయవలననే మేము దీనిని నేర్చితిమి. మేము రోజు రోజు నిట్లే పాడెదము. దయయుంచి నీవు వినవలయును! అనిరి. దానికతడట్లేయని వారిని సగౌరవముగా పంపెను.

మరునాటినుండి వారు రోజురోజువచ్చి వారి నియమానుసారము పాడి వెళ్ళుచుండిరి. ఒకరోజున రాముడు వారి రూపరేఖావిలాసములను చూచి 'వీరి రూపములో సీతపోలికలున్నవి. ఆమెకు కవలలు పుట్టిరని వింటిని. వీరు వారే యైయుందురు. లేకున్న ఇంతచందము లెట్లు వచ్చును? పాపమామె యెంత బాధపడుచున్నదో? ఇప్పుడామెను పిలిపించి సభలో ప్రతిజ్ఞ చేయించినచో ప్రజలు వీరిని నాకొడుకులని నమ్మెదరా?' అనుకొని శత్రుఘ్నుని పిలచి, "నాయనా! హనుమద్విభీషణాదులు తోడురాగా నీవు వాల్మీకి మహర్షి యొద్దకు వెళ్లి 'సీత పతివ్రతయని నేనెఱుగుదును ఆమెవచ్చి సభలో ప్రతిజ్ఞచేసినచో ఆమెను, పిల్లలను పరిగ్రహింతును.' అని చెప్పు

ము" అని పంపెను. వారు వెళ్ళి వాల్మీకి కా మాటలు తెల్పిరి. వాల్మీకి 'శ్రీరాముని యుద్దేశ్యమెట్లో అట్లే జరుగును. దానికి సీతాదేవియు సిద్ధమే' అని వారినిపంపి తాను సీతను తీసికొని వచ్చెను.

## భూదేవి సీతను తీసికొనిపోవుట

సీత ఆమాటలు విన్నది. ఆమెకు దుఃఖము ఆనందమును కూడ కల్గినవి. ఈనాటికి రాముని చూడగల్గితినని ఆనందింపగా, తరోజున అపనిందలు విని విడిచెనని విచారింప నే నేమొగము పెట్టుకొని నలుగురి యెదుట నిలువబడుదును? ఇదా రాముడు కోరునది? చక్రవర్తికి భార్యనై నల్గురియెదుట నేనేమని శపథము చేయుదును? అతడేమని అడుగును? ఇదివరకే నాపై దోషము లారోపించిన ప్రజలు నేనిప్పుడు వెళ్లకున్న నేమనుకొందురో?' అనుకొనుచు సిగ్గుతో, భయముతో, దైన్యముతో సంస్కారములేని ముంగురులు చింపరవందరలై ముఖమును కప్పుచుండగా, చీలమండలవరకు చీరకట్టుకొని, వాల్మీకి బలవంతముపై అతనివెనుక సభాస్థలికి వచ్చినది.

అప్పటికే సభ కిటకిట లాడుచున్నది. మహర్షులు పండితులు, కవులు సభ నిండియున్నారు. ప్రజలెందరో చూడవచ్చిరి. దేవతలు ఏమిజరుగునోయని విమానములపైనచ్చి చూచుచుండిరి. అప్పుడు వాల్మీకి లేచి 'ఓ సభాసదులారా! ఈమెను లక్ష్మణుడు విడచినదాదిగ నేటివరకు నేను సంరక్షించితిని. ఈమె మహాపతివ్రత. ఈ కవల లీమెపుత్రులు. నేను ప్రచేతసుని

పుత్రుడనై మహాతపశ్శాలినై యెన్నటికిని బొంకను. అట్లు బొంకినచో నా తపస్సంతయు వ్యర్థమగు గాక! ఈమెను రాముడు స్వీకరించు గాక! రాముడు చెప్పినట్లు ఈమె కూడ శపథము పల్కును' అని యూరకొనగా రాముడు లేచి 'మహాత్మా! ఈమె పతివ్రతయను విషయము లంకలో చేసిన అగ్నిప్రవేశముతోనే స్థిరమైనది. అయినను లోకాపవాదమును దాటుటకై ఈమెను వదలితిని. వీరిరువురు నాపుత్రులే. ఈమె మహాపతివ్రతయే యైనను మరొక్కసారి ప్రమాణము చేయ గోరుచున్నాను' అన్నమాటల కందరును మెచ్చిరి.

అంత సీత లేచి రాముని పాదపద్మములనే ధ్యానించుచు, తలవాల్చి చేతులు జోడించి గట్టిగా 'నేను రాముని పాదపద్మములనే ధ్యానింతునేని, రామాజ్ఞ చొప్పుననే చరియింతునేని, త్రికరణశుద్ధిగా రాముని తప్పని దాననగుదునేని, ఓభూమాతా! నీవు నన్ను గొనిపొమ్ము.' అనెను. అందరును విస్తుపోయి చూచుచుండిరి. అంతలో ప్రళయ కాలమేఘము లురిమినట్లు పెద్దచప్పుడైనది. భూమికి రంధ్రమేర్పడినది. శేషుడు వాసుకి మున్నగు మహానాగములు రత్నపీఠమును తెచ్చిరి. ఆ వెనుకనే భూదేవి వచ్చి తాను తెచ్చిన భోగవతీ (పాతాళగంగ) నదీజలముతో సీతముఖము కడిగినది. తుడిచినది. ఆమె నూరడించినది. ఆ పీఠము నెక్కించి రసాతలమునకు తీసికొనిపోయినది. అదంతయు నొక మాయలాగున జరిగిపోయినది.

అది చూచి అక్కడివారెల్లరును విచారములతో క్రుంగిపోయిరి. అందరు నొక్కపెట్టుగా 'జనాపవాద మెంత

చేసినది ? రాముఁడెంత పరీక్షచేసినాఁడు ? సీత యెంత యభిమానవతి !' అని వారికి తోఁచినట్లు సానుభూతివాక్యము లాడఁ జొచ్చిరి. రాముఁడు సీతకై మిక్కిలి విచారించి, తొందరకీ విచారముతో ప్రయోజనములేదని 'భూదేవి యెంతపని చేసినది ? నన్ను లెక్కసేయక ఆమె పిన్నియంతనే వచ్చి తీసికొనిపోవునా? ఈమె పని పట్టెదను ! అని మహోగ్రుఁడై కోపావేశముతో లక్ష్మణుని చేతిలో నున్న విల్లును తీసికొని బాణమును సంధించ బోయెను. అప్పుడు బ్రహ్మదేవుఁడు వచ్చి 'మహానుభావా ! కోప ముపసంహరింపుము. నీ యాజ్ఞ మీఱుటకు భూదేవి యెంతటిది ? మీరు మరచితిరి, కాని మీ యాజ్ఞ అట్లే యున్నది.' అని యెన్నో విధముల స్తుతించి ప్రార్థించెను. అప్పుడే భూమిలోనుండి యొక అశరీరవాణి యిట్లు వినపడినది. 'రామా ! సీత లక్ష్మీదేవియే. నీ వాఖరున విముఖత చూపఁగా సహింపలేక తన స్థానమునకు వెడలిపోయినది. మీ రిరువురును లోకములకు తల్లిదండ్రులు కదా ! ఆమెకై విచారింపకుఁడు. ఆమె మీఁది ప్రేమను ఈ కుశలవులమీఁద చూపుము ' అని వినినాక రాముఁడు కొంతస్థైర్యము పూని వాల్మీకిని తరువాతభాగము వినిపింపుమని కోరి, అందరిని యిండ్లకు పంపెను.

అంతలో ప్రొద్దుగ్రుంకినది. రాముఁడు స్నాన సంధ్యావందనాదులు గావించుకొని, హోమములు చేసికొని, సీత గుణగణము లెన్నుచు నా రాత్రి గడపెను. మరునాటినుండి కుశలవు లుత్తరకాండ కథను పాడి వినిపించిరి. రామాయణము పూర్తియైనది. అశ్వమేధయాగము కూడ పూర్తియైనది.

శ్రీరాముడు ఋత్విక్కులకు అపరిమిత దక్షిణ లిచ్చెను. యజ్ఞము చూడవచ్చినవారి నందరిని తగురీతి సత్కరించి ఇండ్లకు సాగనంపెను. తాను యథాప్రకారముగ రాజ్యమేలుచుండెను. శ్రీరాముడు బంగారుసీతను ప్రక్కనునుంచుకొని ఎన్నో అశ్వమేధములు, అగ్నిష్టోమములు, గోమేధములు, వాజపేయములు, అతిరాత్రపౌండరీకాది యాగములు చేసెను. అతనిని మారుపెండ్లి చేసికొమ్మని యెందరో బోధించిరి. కాని యతడేకపత్నీవ్రతస్థుడైనందున ఆ నియమమును కొనసాగించుకొనెను. ఆయన రాజ్యము కలకాల ముండవలెనని ప్రజలు కోరిరి. అమితానందముతో ప్రజలు సుఖించిరి.

అంత నొకప్పుడు కౌసల్య దివమలంకరించినది. ఆమె వెనుక పక్షములోపలనే కైక పతిననుసరించినది. మరికొన్ని వారములకు సుమిత్రయు వారి ననుగమించినది. ఇటు దివికి పోయిన తల్లుల సంతృప్తికై శ్రీరాముడు గో భూ హిరణ్యాది దానములు చేసెను.

## తక్షశిలా నిర్మాణము

ఒకప్పుడు శ్రీరాముడు సభలో నుండగా యుధాజిత్తు తన పురోహితుడైన గార్గ్యుని పంపెను. రాముడతని సత్కరించి వచ్చినపని చెప్పుమనగా నతడు 'సింధు భూనివాసులైన శైలూషులు మా దేశముల కొల్లగొట్టుచున్నారు. అందుచే వారల జయించి మీ సుతుల నిద్దరిని రాజ్యమునకు పట్టము కట్టవచ్చునని మీ మామ చెప్పినాడు' అనెను. శ్రీరాముడది

విని 'నా రెండవనున్నారు?' అనగా 'మూడుకోట్లున్నారు. చాల దుర్మార్గులు' అనెను. భరతుని పిలిచి వారిని జయించి నీ సుతులైన తక్షపుష్కలులకు రాజ్యమేలనిమ్ము' అని పంపెను.

అంత భరతుడు తన పుత్రుల తీసికొని సేనా సమన్వితుడై నెలమీద పదేను రోజుల కచ్చేటికి వెళ్లెను. కేకయులు సాయమురాగా శత్రువుల నందరి నెదుర్కొనెను. ఇరుపక్షముల వారికిని పోరు ఘోరముగా జరిగినది. అంతు భరతుడు సంవర్తాస్త్రమును సంధించి వేయుగా వారందరును బూడిద యైరి. తరువాత సింధు దేశమున 'తక్షశిలయు', గాంధార దేశమున 'పుష్కలావతి'ని నగరములు కట్టించి ఆ రెండు పట్టణములకు తన పుత్రుల నిద్దరిని పట్టభద్రులుగా జేసి అక్కడ నైదేండ్లుండి శ్రీరామపాదసేవకై అయోధ్యకు వచ్చివేసెను.

అంగదేశమును జయించి దానికి లక్ష్మణుని కుమారుడగు అంగదుని, ఉత్తరమున నున్న మల్ల దేశమున కతని తమ్ముడగు చంద్రకేతుని రాజులుగా చేసెను. ఈ రీతిగా అందరిని అన్ని దేశములకు రాజులుగా జేసి శ్రీరాముడు పదునొక్క వేలేండ్లు రాజ్యమేలెను. భరతలక్ష్మణులు లాతని సేవించుచుండిరి.

## లక్ష్మణపరిత్యాగము

అంత నొక్కనాడు యమధర్మరాజు ముని వేషమున రాముని కొలువునకు వచ్చి ముంగిసాలలో నిలువబడి లోనికి కబురంపెను. లక్ష్మణుడు రామునితో ఎవరో ముని వచ్చెనని చెప్పెను. అతడు లోపలికి ప్రవేశ పెట్టించెను. అతనికి నమస్క-

రించి 'పనియేమి?' అని అడుగగా 'నీతో రహస్యము మాట్లాడ
వలసిన అవసరమున్నది. మన మిద్దరము మాట్లాడునప్పు డెవరు
వచ్చినను వారిని నీవు చంపవలెను. అట్లు నియమము పెట్టినగాని
సంభాషింప వీలుపడదు' అనగా శ్రీరాము డందుల కంగీకరించి
సభ్యులనందరిని పంపివేసి లక్ష్మణుని ద్వారమందుంచి 'ఎవరు
వచ్చినను సమయము కాదని చెప్పుమనెను. లోనికేగి ఆ
మునితో మాట్లాడుచుండెను. అంత నా వచ్చిన ముని శ్రీరా
మునికి నమస్కరించి 'దేవా! నేను బ్రహ్మ పంపగా వచ్చిన
యముడను.' మీరు విష్ణుమూర్తి అవతారము అవతార
కృత్యములన్నియును పూర్తియైనవి. కాన దేవరవారు వైకుంఠ
మునకు వేంచేయుడు.' అని పరమేష్ఠి చెప్పుచున్నాడని, చెప్పగా
'బ్రహ్మ హితవు పల్కెను. అట్లే చేయుదును.' అనుచుండెను.

ఇంతలో దుర్వాసుడు ద్వారముకడకు వచ్చి తాను
వచ్చినట్లు రామునికి తెల్పుమనెను. లక్ష్మణు డాతనికి నమస్క
రించి 'మునీంద్రా! ఇది సమయము కాదు' అనుచుండ 'నేను
వచ్చినప్పుడు త్రిమూర్తులే సమయము కాదనలేరే? నీవెంత?
ఇప్పుడు నీవు వెళ్లి చెప్పనిచో మీ వంశము పుత్రపౌత్రులతో
సహా నీరగునట్లు శపింతు'ననెను. లక్ష్మణుడు రాముడు చేసిన
ప్రతిజ్ఞ యెరుగును. కాని వంశమంతటికి శాపము తగులుట
కంటె తానొక్కడే బాధపడుట యుక్తమని లోనికేగెను.
అంతలో అతని జూచి యము డంతర్ధానమయ్యెను. లక్ష్మణుడు
శ్రీరామునకు దుర్వాసుని రాకను తెలుపగా నతడు వెంటనే
వచ్చి దుర్వాసునికి నమస్కరించి 'సెలవేమి?' అని ప్రార్థిం

పగా అతడు 'నేను వేదవ్యాసుని తపసుతో చిక్కితిని. ఆకలి తీర్పుమనెను. శ్రీరాముడు వెంటనే తగువారి నియోగించి దుర్వాసునకు విందుచేసెను.

సభలోనికేగి లక్ష్మణునిపిలిచి చాల విచారపడి సభ్యులతో తానుచేసిన ప్రతిజ్ఞను, లక్ష్మణుడు వచ్చుటయు తెల్పి కర్తవ్యమేమో చెప్పుడు' అనెను. వారు 'అతి సన్నిహితుని విడుచుటయే చంపుటకంటె ఎక్కు'డని వారు చెప్పిరి. రాముడతని విడువలేక ఎక్కువసేపు విచారించెను. కాని లక్ష్మణుడు 'నన్నువ్వుడు వదలుకున్న ప్రతిజ్ఞాభంగము కాగలదు. కనుక నెప్పుక నడలము'ని కోరెను. అతడట్లే మనసు దిటవుచేసికొని లక్ష్మణుని పొమ్మనెను. అతడు శ్రీరాముని పాదములకు సుదిసారిగా నమస్కరించి సరయూనదిలో ప్రవేశించి ముందుగా వైకుంఠమును చేరెను.

## శ్రీరాముని వైకుంఠయాత్ర

అంత రాముడు కుశుని కోసలములకును, లవుని ఉత్తర కోసలములకును రాజులుగా జేసెను. శత్రుఘ్ననకు తన మహాప్రస్థానము నెరిగించుటకై దూతనంపెను. అతడు మూడురోజులలో మధురకేగి శ్రీరామునాజ్ఞ తెలిపెను. అంత శత్రుఘ్నుడు మధురాపట్టణమునకు సుబాహుని, విదిశాపట్టణమునకు శత్రుఘాతిని పట్టముకట్టి, తాను మిక్కిలి వేగముగా అయోధ్య చేరెను.

శ్రీరాముడు తన మహాప్రస్థానవార్త నందరికిని తెలుపజేసెను. విభీషణ సుగ్రీవాదులు వచ్చిరి. దేశములోని ప్రజలెల్లరు ననుగమనమునకై వచ్చి అయోధ్య చేరిరి. అప్పుడు శ్రీరాముడు హనుమంతుని, జాంబవంతుని చిరస్థాయులుగ నుండుమని చెప్పెను. తక్కిన వారెల్లరు అతని ననుసరించుటకు సంసిద్ధులైరి. ప్రజలుకూడ తమ యాస్తిపాస్తులను ఇచ్చవచ్చినట్లు దానభోగముల కిచ్చివేసి ధర్మకార్యములు పూర్తిచేసికొని అయోధ్యకు వచ్చిరి.

మరునాడు శ్రీరాముడు వశిష్ఠునిపిలిచి 'మునీశ్వరా! నేను వైకుంఠయాత్ర చేయదలచినాను. ఆ మహాప్రస్థానమునకు వలయు మంత్రతంత్రముల పూర్తిచేయుమ'నెను. వశిష్ఠు డట్లు నెరవేర్చగా రాముడు పట్టుబట్టలు కట్టుకొని వ్రేల దర్భలుంచుకొని, జుట్టు వ్రేలిముడి వేసికొని, నాసాగ్రనిహిత దృష్టియై మౌనము వహించెను. అతడు ముందు నడచుచుండ నందరును వెనుక నడచిరి. అంతలో బ్రహ్మాది దేవతలు వైకుంఠ ప్రభువు సానుచరపరివారుడై వేంచేయుచుండెనని విమానములు తీసికొనివచ్చిరి. దేవదుందుభులు మ్రోగుచుండెను. పుష్పవృష్టికురియుచుండెను. అంత శ్రీరాముడు సరయూనదిలో ప్రవేశించెను. వెంటనే అతనికి స్వరూపము వచ్చినది. చతుర్భుజములు, పంచాయుధములు శ్రీవత్స వనమాలలు, కిరీటముతో భగవానుడు విమానము నధిష్ఠించెను. 'వీరందరు నన్ను నమ్మి

కొనియున్నారు. వీరి కందరికిని మోక్షమునిమ్మ'ని చెప్పగా బ్రహ్మ వారి కందరికిని తగు ఏర్పాట్లుచేసెను. ఎలుక, చిలుక మొదలగు సమస్తమును భక్తులై విరాగులై శ్రీరాము ననుగమించిరి. వారికందరికిని ముక్తిహస్తగతమైనది. అందరును విమానములపై దివికేగిరి. శ్రీ మహావిష్ణువు బ్రహ్మాది దేవతలు వెంటరాగా వైకుంఠపరమపదము నలంకరించెను. అచ్చట శివుడతనికి నమస్కరించి స్తుతించెను. తనకన్న ముందే వైకుంఠము జేరిన సీతాదేవి లక్ష్మీదేవియై యెదురువచ్చి నమస్కరించినది. భూదేవియు నీళాదేవియు ప్రక్కన చామరములు వీచుచుండిరి.

అప్పుడు విష్ణుమూర్తి లక్ష్మీదేవితో 'నీవు నాకంటె ముందుగానే వచ్చితివికదా!' అని భూదేవికేసి చూచెను. ఆమె 'ఇందు నా తప్పేమున్నది?' అనెను. విష్ణువు 'నీవేకదా గోడి తెచ్చితివి?' అనగా లక్ష్మీదేవి 'ఎవరో యెరుగనిమూర్ఖులు అపవాదులాడిరని అడవిని త్రోయించిరి కదా! నా మీదనే తప్పువేసి వాదించిన నేనేమి జవాబు చెప్పగలను? ఇక్కడకు పంపు నుద్దేశ్యముతోడనే కదా ప్రతిజ్ఞ మరలచేయుచున్నారు! మీ అభిప్రాయానుసారమే నడుచుకొంటిని. ఇందు భూదేవి తప్పేమున్నది?' అని సర్దిచెప్పినది. అప్పుడు శ్రీమన్నారాయణుడు 'ఏదో పరిహాసమునకై అంటిని. అంతమాత్రమునకే కోపములా? క్షమింపుము.' అని సరసోక్తులతో మెల్లగా ఆమె

ననుసరించెను. తరువాత శ్రీహరి యథాప్రకారముగా శ్రీదేవిని వక్షస్థలముపై నుంచుకొని, భూదేవియు నీళాదేవియు వింజామరలు వీచుచుండగా, శేషాహితల్పముపై శయనించి సుఖము లందుచుండెను.

దీనిని చదివినను, విన్నను పుత్రపౌత్రాభివృద్ధికల్గి ఆయురారోగ్యైశ్వర్యాది సమృద్ధి కల్గును.

ఇతి ఉత్తరరామాయణమునకు వచనరచన.

సర్వేజనా స్సుఖినోభవన్తు